జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును.
వివరాలకు సంప్రదించండి
9000621111, 9440137451
76600 27670, 9908991763

సంపుటి 15 సంచిక 270 విశాఖపట్నం | బుధవారం 15 జూన్ 2022 | 8 పేజీలు | వెల : 5.00

# మీ ఆశీస్సులు ఉన్నంతవరకు ఎవరినైనా ఎదుర్కొంటా: జగన్

శ్రీసత్యసాయి జిల్లా, ప్రజాపాలన ప్రతినిధి: అనంతపురం జిల్లాను ఎడారి జిల్లా అనేవారని.. దేవుడి దయ వల్ల అలాంటి పరిస్థితులు మారిపోతున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గంగమ్మ తల్లి నేరుగా పైకి వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో రైతన్నలకు రూ. 2,977.82 కోట్ల బీమా పరిహారాన్ని మంగళవారం వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2021 ఖరీఫ్‌లో పంటనష్టపోయిన 15.61 లక్షలమంది రైతులకు రూ. 2,977.72 కోట్లు ఇస్తున్నామన్నారు.

"ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రైతులకు బీమా కింద రూ. 885 కోట్లు చెల్లిస్తున్నాం. ప్రభుత్వ పాలనలో మార్పును గమనించాలని కోరుతున్నాం. ఇంతకు ముందు బీమా వస్తుందో లేదో తెలియని పరిస్థితి. ఎవరికి వస్తుందో, ఎవరికి రాదో తెలియని పరిస్థితి. ఒక సీజన్‌లో నష్టం జరిగితే.. మళ్లీ మరుసటి ఏడాది అదే సీజన్ రాకముందే నేరుగా రైతుల చేతుల్లో పెడుతున్నాం. లంచాలు, వివక్ష లేకుండా పంటల బీమా పరిహారాన్ని చెల్లిస్తున్నాం. పారదర్శకంగా ప్రతిరైతన్న కుటుంబానికీ మంచి జరుగుతోంది. పంట నష్టపోతే, రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుంది. అందుకే పంటల బీమా విషయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. గడచిన మూడేళ్లుగా రైతులకు పంట నష్టం



విషయంలో ఈ ప్రభుత్వం తోడుగా నిలబడింది.

**గత ప్రభుత్వం.. ఈ ప్రభుత్వం.. తేడా గమనించండి...**

గత తెలుగుదేశం పార్టీ పాలనలో అక్షరాల ఐదేళ్ల కాలానికి పంటల బీమా కింద 30.85 లక్షల మంది రైతులకు రూ. 3411 కోట్లు ఇచ్చారు. ఇవాళ మీ బిడ్డ పాలనలో మూడేళ్ల కాలంలో అక్షరాల 44.28లక్షల మంది రైతులకు ఉచితంగా పంటల బీమా చేయించి రూ. 6.685 కోట్లు చెల్లిస్తున్నాం. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడాను గమనించమని కోరుతున్నాను. గత ప్రభుత్వం పెట్టిన రూ. 715.84 కోట్ల రూపాయల పంటల బీమా బకాయిలను కూడా మీ బిడ్డ ప్రభుత్వం చెల్లించింది. పంటల బీమాకు సంబంధించి గత ప్రభుత్వం బకాయిలు పెడితే.. ఈ ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన నష్టాన్ని.. మళ్లీ అదే సీజన్ వచ్చేలోగా పెడుతున్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో మనం గత పాలకులతో కాదు పోటీపడేది.. దేశంతో పోటీపడుతున్నాం. మన గ్రామాల్లో ఆర్బీకేలను చూసేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు వస్తున్నారు. ఆర్బీకేల ద్వారా వస్తున్న మార్పులను చూస్తున్నారు. మూడేళ్లుగా మన పాలనలో వచ్చిన మార్పులను చూడండి

**గతంలో ఎప్పుడూ చూడని విధంగా..**

గతంలో ఎప్పుడూ చూడని విధంగా వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ కింద రూ. 23,875కోట్ల రూపాయలు ఈ ఒక్క పథకం ద్వారానే నేరుగా రైతన్నల చేతుల్లో పెట్టాం. జూన్ మాసం రాకముందే.. వ్యవసాయ పనులు రాకముందే... రైతు భరోసా సొమ్మును నేరుగా రైతన్నల ఖాతాల్లో వేశాం. మూడేళ్లలో చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా రైతుల కోసం మీ బిడ్డ ప్రభుత్వం చేసిన ఖర్చు అక్షరాల రూ. 1,27,823 కోట్లు. పంటల బీమాకు మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇ-క్రాపింగ్ చేయించి ప్రతి రైతన్నకు పారదర్శకంగా చెల్లింపులు చేస్తున్నాం. సీజన్‌లో నష్టం జరిగితే.. సీజన్ ముగియకముందే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నాం. రైతులకు సున్నావడ్డీకింద రూ. 1283 కోట్లు చెల్లించాం మూడేళ్లలో. గత ప్రభుత్వంలో ఐదేళ్లకాలంలో సున్నావడ్డీ కింద చెల్లించింది కేవలం రూ. 782 కోట్లు. ఆర్బీకేలు రైతన్నలకు తోడుగా నిలుస్తున్నాయి.

పగటి పూటే 9 గంటలపాటు రైతన్నలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దీని కోసమే ఫీడర్లకోసం రూ. 1700 కోట్లు పెట్టాం. గత ప్రభుత్వం పెట్టిన రూ. 8,845 కోట్ల **(మిగతా 2లో..)**

# పెగాసెస్ స్పైవేర్‌పై సర్కార్ దూకుడు

- **చంద్రబాబు హయాంలో పెగాసెస్ స్పైవేర్ వ్యవహారం..**
- **భూమన అధ్యక్షతన హౌస్ కమిటీ భేటీ!**




అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో కొద్ది రోజుల క్రితం పెగాసస్ స్పై వేర్ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు హయాంలో పెగాసెస్ స్పైవేర్ కొనుగోలు చేశారని పశ్చిమ్‌బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కామెంట్ చేశారనే వార్తల నేపథ్యంలో ఏపీ రాజకీయాల్లో వివాదం చెలరేగింది. దీనిపై ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం.. టీడీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టీడీపీ హయాంలో రాజకీయ ప్రత్యర్థులపై స్పైవేర్‌ను ఎలా ఉపయోగించిందనే దానిపై సమగ్ర విచారణ జరిపేందుకు హౌస్ కమిటీని ఏర్పాటు చేయాలని వైసీపీ కోరింది. ఈ నేపథ్యంలోనే పెగాసస్ వివాదంపై సమగ్ర విచారణకు హౌస్ కమిటీని ఏర్పాటు చేయాలని శాసనసభ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం మార్చి 21న అసెంబ్లీలో ప్రకటించారు. అయితే.. తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి ఏపీ సర్కార్ దూకుడు పెంచింది. పెగాసస్ అంశంలో ఏర్పాటైన హౌస్ కమిటీ ఇవ్వాల తొలిసారిగా భేటీ అయ్యింది. ఎమ్మెల్యే భూమన కరుణారెడ్డి అధ్యక్షతన హౌస్ కమిటీ భేటీ జరుగుతోంది. ప్రాథమికంగా జరిగిన ఈ సమావేశంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశాలను చర్చించినట్టుగా తెలుస్తోంది. కాగా, ఈ అసెంబ్లీ హౌస్ కమిటీ రేపు హోం శాఖ, ఐటీ శాఖల అధికారులతో కూడా భేటీ కానున్నట్టు తెలుస్తోంది. అయితే.. హౌస్ కమిటీ ఏర్పాటు తర్వాత దాదాపు 3 నెలల తర్వాత తొలిసారి భేటీ కావడంతో ఈ వ్యవహారంలో ఏపీ సర్కార్ దూకుడుగా వ్యవహరించే అవకాశమే ఉందనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు పెగాసెస్ స్పైవేర్ కొనుగోలు ఆరోపణలను తెలుగుదేశం పార్టీ ఖండించింది. చంద్రబాబు హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు.. 2019 మే వరకు పెగాసస్ స్పైవేర్‌ను ప్రభుత్వం ఎప్పుడూ కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు. అయితే 2019 మే తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు ఏబీ వెంకటేశ్వరరావు.

# నిరుద్యోగులకు మోదీ శుభవార్త...

## వచ్చే ఏడాదిన్నరలోగా 10 లక్షలమందికి ఉద్యోగాలు



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి దేశంలోని నిరుద్యోగులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం శుభవార్త వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నరలోగా మిషన్ మోడ్‌లో భాగంగా దేశంలోని వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వశాఖల్లో 10లక్షలమందిని రిక్రూట్ మెంట్ చేయాలని ప్రధాని మోదీ మంగళవారం కేంద్ర అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మానవ వనరుల స్థితిగతులను సమీక్షించిన తర్వాత మోదీ దిశానిర్దేశం చేసినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. నిరుద్యోగ సమస్యపై ప్రతిపక్షాలు తరచూ విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ రంగాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్న పోస్టులపై ప్రతిపక్షాలు తరచూ ధ్వజమెత్తాయి. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని కేంద్రప్రభుత్వ శాఖలు, మంత్రిత్వ శాఖలలో మానవ వనరుల స్థితిని సమీక్షించారు రాబోయే 1.5 సంవత్సరాలలో 10 లక్షల మందిని మిషన్ మోడ్‌లో ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ చేయాలని ఆదేశించింది" అని పీఎంఓ ట్వీట్‌లో పేర్కొంది.

# ఈనెల 22న ఏపీ కేబినెట్ భేటీ

అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 22న జరగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఏపీ కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబందించిన పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశముంది.

# 20నుంచి శాఖాపరమైన పరీక్షలు..

## ప్రకటించిన ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు నిర్వహించే డిపార్టమెంటల్ పరీక్షలు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. మంగళవారం ఒక ప్రకటనలో 13 ఉమ్మడి జిల్లాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు మొత్తం 55 వేల 36 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రకటించారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# నేటి నుంచి చంద్రబాబు పర్యటనలు..

**చంద్రన్న భరోసా పేరుతో నిర్వహణ..**



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి:తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలకు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు పర్యటనలు ప్రారంభం అవుతున్నాయి. ఎన్టీఆర్ స్ఫూర్తి చంద్రన్నభరోసా పేరుతో ఏడాది పాటు పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనలు ఉంటాయి. ఒక్కో టూర్‌లో మూడు రోజుల పాటు- చంద్రబాబు జిల్లాలలో పర్యటించనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, విధ్వంస పాలనపై ప్రజల భవిష్యత్‌కు భరోసా ఇచ్చేలా **(మిగతా 2లో..)**

# రక్షణ దళాల్లోకి ఇక నవ యువత



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి భారతీయ నవ యువతకు రక్షణ దళాలు స్వాగతం పలుకుతున్నాయి. నాలుగేళ్ళపాటు సేవలందించడానికి అగ్నివీరులను నియమించే కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. అగ్నిపథ్ పేరుతో ప్రారంభమైన ఈ పథకంలో పదిహేడున్నరేళ్ళ నుంచి 21 సంవత్సరాల వయసుగలవారిని త్రివిధ దళాల్లో అగ్నివీరులుగా నియమిస్తారు. అగ్నిపథ్ పథకాన్ని గతంలో 'టూర్ ఆఫ్ డ్యూటీ'గా పిలిచేవారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాల అధిపతుల సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. భద్రతకు సంబంధించిన కేబినెట్ కమిటీ రెండేళ్ళపాటు విస్తృతంగా చర్చించిన తర్వాత ఈ పథకానికి ఆమోదం తెలిపింది. రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాల అధిపతులతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ స్కీమ్ ఓ పరివర్తక కార్యక్రమమని తెలిపారు. ఇది గొప్ప మార్పును, దేశ యువతకు ఉద్యోగావకాశాలను తీసుకొస్తుందన్నారు. ఈ పథకం వల్ల భారత దేశ భద్రత పటిష్ఠమవుతుందని తెలిపారు. అదే సమయంలో రక్షణ దళాలకు యూత్‌ఫుల్ ప్రొఫైల్ వస్తుందన్నారు. రక్షణ దళాలవైపు అందరూ ఎంతో గౌరవంతో చూస్తారన్నారు. యూనిఫాం ధరించాలని యువత కోరుకుంటారన్నారు. ప్రొఫైల్ యూత్‌ఫుల్‌గా ఉంటుందని తెలిపారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్ లెవెల్ చాలా మెరుగ్గా ఉంటాయని చెప్పారు. అత్యున్నత స్థాయి నైపుణ్యంగల దళం అందుబాటులోకి వస్తుందన్నారు. అగ్నివీరులకు **(మిగతా 2లో..)**



## నక్కలవారిపాలెంలో గడప గడపకు ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల, జూన్ 14, ప్రజాపాలన : : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, చీరాల మండలం కావూరి వారిపాలెం పంచాయితీ నక్కలవారిపాలెం నందు, వైసిపి ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేష్ దంపతుల ఆధ్వర్యంలో, గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమం చేపట్టారు.గ్రామంలో గడప గడపకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామం లో రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు గున్ని వికర్ణ రెడ్డి, చీరాల సుబ్బారెడ్డి, అవ్వారు ఆదినారాయణ, రాజారామ్, బోనషి నారయ్య, బోనషి ప్రసాద్, యెరిచర్ల ఇమ్మనియేల్, సలగల మాణిక్యరావు,నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యాదాత రామచంద్ర వాసు మృతి విద్యా రంగానికి తీరని లోటు: చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్



చీరాల, జూన్ 14, ప్రజాపాలన : : విద్యా ప్రదాత ఊటుకూరి రామచంద్ర వాసు మృతి విద్యా రంగానికి తీరని లోటని, చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. విద్యా ప్రదాత,చీరాల వి.ఆర్.ఎస్.అండ్ వై. ఆర్. యన్. కళాశాల అధ్యక్షులు ఊటుకూరి వెంకట రామచంద్ర వాసు మరణించగా, వారి ఇంటికి, చీరాల శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి వెళ్లి, వూటుకూరి రామచంద్ర వాసు పార్థివ దేహానికి, పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే బలరామ్ తో పాటు,రామచంద్రవాసు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన వారిలో, నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస రావు, నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ నందం రామారావు సతీమణి వివేక వర్ధని మృతిపట్ల ప్రముఖుల సంతాపం



మచిలీపట్నం టౌన్ జూన్ 14ప్రజాపాలన :మచిలీపట్నం మంగళవారం హౌసింగ్ బోర్డ్ కాలనీ సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ నందం రామారావు సతీమణి, దూరదర్శన్ చీఫ్ కెమెరామెన్ నందం శ్రీనివాస్ మాతృమూర్తి నందం వివేక వర్ధని(76) మంగళవారం ఉదయం గం.6.30 నిమిషాలకు హృదయ సంబంధిత వ్యాధితో విజయవాడ హాస్పటల్ లో మృతి చెందారు . మృతదేహాన్ని దర్శనార్థం హౌసింగ్ బోర్డు కాలనీలోని వారి స్వగృహంలో ఉంచారు. దివంగత వివేక వర్ధిని పార్థివ దేహం పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు, జర్నలిస్ట్ లు సందర్శించి నివాళులర్పించారు. ఎంపీ బాలసౌరి, ప్రముఖసినీ డైరెక్టర్ మారుతి నందం రామారావుకు ఫోన్ చేసి పరామర్శించారు. టీడీపీ నేత, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, సీతారామయ్య, సీనియర్ పాత్రికేయులు చలమలశెట్టి రమేష్, అంబటి శేషు బాబు, నక్కా ప్రసాద్, మతిన్, గణేష్, గంగాధర్, ప్రభాకర్,రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, చింతయ్య, శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం అంతిమ సంస్కార కార్యక్రమం నిర్వహించారు కుటుంబ సభ్యులు బంధువులు పుర ప్రముఖులు పాల్గొన్నారు

## ఉపాధి పనుల్లో అవకతవకలు




గోకవరం ప్రజాపాలన ప్రతినిధి జూన్ 14 : గోకవరం మండలం ఇటీకాయల పల్లి గ్రామంలో పుచ్చకాయలు వారి చెరువులో ఉపాధి పనులకు పిల్లి చంద్రావు వారి కుటుంబం కలసి 2-6-2022నుండి8-6-2022 వరకు 7 రోజులు పని సేసిన 1 రోజు మాత్రమే మస్తరు వేశారు అని ఇటికాయల పల్లి గ్రామానికి చెందిన పిల్లి చందర్రావు కుటుంబం ఆవేదన వ్యక్తం సేసారు.కొంతమంది వ్యక్తులు ఇంటి దగ్గరే వుండి దొంగ మస్తర్లు వేయించుకుంటున్నారు . అంతేకాకుండా మా గ్రామ ఉపాధి పని ఎఫ్ ఏ వారి తల్లి. తండ్రి .తమ్ముడు పనికి రాకపోయినా క్రమం తప్పకుండా ప్రతి వారం దొంగ మస్తర్లు వేయించుకుంటున్నారు అన్నారు. దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని యమ్ డి ఓ , ఏపీఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది .ఈకార్యక్రమంలో ఇటికాయలపల్లి గ్రామ సర్పంచ్ దార రామకృష్ణ , ఎం పి టి సి గల్లా కృష్ణ ,మాజీ ఎంపిటిసి ఇది అశోక్ తదితరులు పాల్గొన్నారు

# అందరికీ తిండి పెట్టే రైతులకు అండగా ఉంటాం



మచిలీపట్నం జూన్ 14ప్రజాపాలన :జిల్లాలో ఇకపై ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుకు రసీదు ఇవ్వడం జరుగుతుంది - కలెక్టర్ వెల్లడిడాక్టర్ వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకం క్రింద రైతులకు పంటల బీమా పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పామర్రు మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష, జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు శాసనసభ్యులు కైలె అనిల్ కుమార్, అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి జిల్లాలో 13,321 మందిరైతులకు రూ. 50.71 కోట్లు పంపిణీ గావించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా డెల్టాకు ఈ నెల 10వ తేదీన నీరు విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు పంటల సాగు ప్రారంభించాలని అన్నారు జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచామని, ఇంకా రైతుల అవసరం మేరకు అందించడం జరుగుతుందన్నారు. ఈరోజు జిల్లాలో 13,321 మంది రైతులకు 50.71 కోట్లు పంటల బీమా పంపిణీ చేయగా, పామర్రు నియోజకవర్గంలోని రైతులకు 50 శాతం పైగా బీమా మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు పొందడం రైతుల హక్కు అన్నారు. ఆర్ బి కే ల ద్వారా ప్రభుత్వ పథకాలు అందించే షెడ్యూలు గురించిన అవగాహన రైతులు కలిగి ఉండాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం రైతులకు అందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరి,పథకాల ప్రయోజనం రైతులు పొందడానికి ఈ క్రాప్ ఆధారం, ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లితే రైతులు ప్రభుత్వ పథకాలు పొందలేరు. దీని నివారణకు జిల్లాలో ఈ ఏడాది ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకున్నాక రసీదు ఇవ్వడం జరుగుతుందని,ఇచ్చిన రశీదులో తాను పండించే పంటలు వాటి విస్తీర్ణం సరిగా నమోదయ్యాయా లేదా సరి చూసుకుని సంతకం చేయాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందరికీ తిండి పెట్టే రైతులకు అండగా ఉంటామన్నారు జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు సకాలంలోపంటల బీమా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. రైతులకు తోడుగా ఆర్ బి కే లు ఏర్పాటు చేసి, రైతు భరోసా క్రింద సాగు పెట్టుబడి సాయం అందించడంతో పాటు వైయస్సార్ యంత్ర సేవ పథకం క్రింద రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు.

## పామర్రు నియోజకవర్గంలో గృహా నిర్మాణాలు వేగంగా జరగాలి: కలెక్టర్



మచిలీపట్నం కలెక్టరేట్ జూన్ 14 ప్రజాపాలన :గృహనిర్మాణాల లేఅవుట్లలో భూమి చదును(లెవెలింగ్) చేసేందుకు వెంటనే టెండర్లు ఆహ్వానించమని కలెక్టర్ పి.రంజిత్ బాషా హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పామర్రు అసెంబ్లీ నియోజకవర్గం గృహనిర్మాణాల ప్రగతి, ఇళ్లస్థలాల పంపిణీపై శాసన సభ్యులు కైలే అనీల్ కుమార్ తో కలసి కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో గృహనిర్మాణం,ఇళ్ల స్థలాల పంపిణీ, లెవెలింగ్ పనులను వేగవంతం చేయుటకు మండలంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు, ఆర్డిడబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పామర్రు నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న గృహాలన్ని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఇళ్ల స్థలాలకు భూములు సేకరించిన తరువాత కోర్టుల్లో లేదా స్థానిక ప్రజల ఆటంకాల వల్ల గృహనిర్మాణాలు ప్రారంభించ లేకపోతే వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలు చూసి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే జిల్లాలో సుమారువెయ్యి కోట్ల రూపాయలతో కేవలం ఇళ్ల స్థలాల కోసం భూమి కొనుగోలు చేశామని, కాని మండల అధికారులుమాత్రం రెండు కోట్ల రూపాయల స్థలసేకరణ కోసం ఎందుకు వెనకాడుతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. స్థలాల సేకరణలో ప్రభుత్వంపై భారం పడకుండా తక్కువ ధరలు నిర్ణయించాలని ఆయన మండల అధికారులకు సూచించారు. అలాగే లబ్దిదారులకు స్థలం అనుకూలంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కూడా తహసీల్దార్లదే అన్నారు. గుడివాడ, ఉయ్యూరు ఆర్డీఓలు పామర్రులోని 5 మండలాల్లో గృహనిర్మాణాల లేఅవుట్లను ప్రత్యేకంగా సందర్శించి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.మండలంలోని అధికారులంతా వచ్చే 6 నెలలోపు గృహనిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐనంపూడి గ్రామంలో కట్టే గృహాలు కొలతల ప్రకారం లేవని కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్డీఓను తనిఖీ చేసి తనకు నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే లేఅవుట్లలో విద్యుతైన్ల ఏర్పాటు, తాగునీటి వసతిప్రాధాన్యత ప్రకారం చేపట్టాలన్నారు. గృహనిర్మాణానికి ప్రారంభించినవి, లెవెలింగ్ చేస్తున్నవి, లెవెలింగ్చేయాల్సినవి ప్రత్యేకంగా విభజించుకొని ఆమేరకు ప్రాధాన్యత ప్రకారం ఏర్పాట్లు చేయమని విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు.

## నేటి నుంచి చంద్రబాబు పర్యటనలు..

(మొదటి పేజీ తరువాయి)

అధినేత టూర్లు ఉండనున్నాయి. శతజయంతిపై ఏడాది ఉత్సవాల నిర్వహణలో భాగంగా రేపు అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో తొలి జిల్లా మహానాడు జరుగుతుంది. టూర్లో మొదటి రోజు మహానాడు మహాసభ ఏర్పాటు చేస్తున్నారు. రెండో రోజు పార్లమెంట్‌లోని 7 నియోజకవర్గాల నేతలు, ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరుగుతుంది. మూడో రోజు ప్రజాసమస్యలు, ప్రభుత్వ బాదుడే బాదుడుపై రోడ్ షోలు ఉండనున్నాయి. ఏడాది పాటు 100కి పైగా నియోజకవర్గాలు కవరయ్యేలా చంద్రబాబు పర్యటనలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా నెలకు రెండు టూర్లు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

## రక్షణ దళాల్లోకి ఇక నవ యువత

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ వేతనాలు లభిస్తాయని చెప్పారు. పదవీ విరమణ సమయంలో కూడా మంచి ప్యాకేజ్ లభిస్తుందని చెప్పారు.

బహుముఖ సవాళ్లకు సిద్ధంగా...

భారత సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే మాట్లాడుతూ, సైన్యాన్ని భవిష్యత్తులో యుద్ధానికి సంసిద్ధంగా ఉండే దళంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. సంపూర్ణ యుద్ధ క్షేత్రంలో బహుముఖ సవాళ్ళను ఎదిరించే సత్తాగల దళంగా సిద్ధం చేయడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. ఐఐటీ, ఇతర సాంకేతిక విద్యా సంస్థల నుంచి అగ్నివీరులను ఎంపిక చేయనుండటం వల్ల సైన్యానికి సాంకేతిక సమర్థత పెరుగుతుందని చెప్పారు.

# మీ ఆశీస్సులు ఉన్నంతవరకు ఎవరినైనా ఎదుర్కొంటా: జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్యుత్ బకాయిలను చెల్లించాం. ధాన్యం చెల్లింపులకోసం గత ప్రభుత్వం రూ.960 కోట్లు బకాయిలు పెడితే దాన్ని చెల్లించాం. విత్తనాల కొనుగోలు కోసం బకాయిలు పెట్టిన రూ. 384 కోట్ల డబ్బునుకూడా ఈ ప్రభుత్వమే చెల్లించింది. దురదృష్టవశాత్తూ రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఆ రైతన్న కుటుంబానికి రూ.7 లక్షల వెంటనే ఇస్తున్నాం. కౌలు రైతు ఆత్మహత్య దురదృష్టవశాత్తు చేసుకుంటే వెంటనే ప్రభుత్వం ఆదుకుంటుంది

**దత్త పుత్రుడికి ఆరోజు గుర్తుకు రాలేదు..**

చంద్రబాబు దత్తపుత్రుడు అనంతపురం వచ్చాడు. గోదావరి జిల్లాలకు కూడా వెళ్లాడు. పట్టాదారు పాసు పుస్తకం ఉండి, ఆత్మహత్య చేసుకుంటే పరిహారం అందని రైతు కుటుంబాన్ని చూపించగలవా? అని సవాల్ విసిరితే.. చూపించలేకపోయారు. సీసీఆర్సీ కార్డు ఉండి.. ఆత్మహత్యచేసుకుని ఉన్న కౌలు రైతును ఒక్కరినైనా చూపించగలవా? అంటే చూపించలేకపోయారు. మన కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఎంత బాధపడతావెూ.. అదే రకంగా రైతులు చనిపోతే ఆవేదన వ్యక్తంచేస్తూ వారికి తోడుగా నిలబడ్డాం. 458 కుటుంబాలకు చంద్రబాబు పరిహారం ఇవ్వకపోతే.. జగనన్న ప్రభుత్వం మాత్రమే వారికి ఇచ్చింది. ఈ జిల్లాలకు పోవాలి, ఇలా గ్రామాలకు పోవాలని అని ఆ దత్తపుత్రుడికి ఆ రోజు గుర్తుకు రాలేదు. పరిహారం ఇవ్వాలని చంద్రబాబుకు అనిపించలేదు.

**అవినీతి లేకుండా, వివక్ష లేకుండా..**

ధాన్యం కొనుగోలు కోసం మూడేళ్లలో దాదాపు రూ.45వేల కోట్లు ఖర్చు చేశాం. చంద్రబాబు ఐదేళ్లలో రూ.30-32వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదు. పాడి రైతులకు మంచి చేయడానికి అమూల్‌ను తీసుకు వచ్చాం. ప్రపంచంలోనే 8వ స్థానంలో ఉంది. చంద్రబాబు కంపెనీ హెరిటేజ్‌తోపాటు అందరు కూడా లీటరు రూ.5 నుంచి రూ.10లు పెంచాల్సిన పరిస్థితి వచ్చింది. అవినీతి లేకుండా, వివక్ష లేకుండా పథకాలు అమలు చేస్తున్నాం. ఒక్కపైసా కూడా అవినీతి లేదు. మీ బిడ్డ బటన్ నొక్కుతున్నాడు.. నేరుగా మీ చేతికే వస్తోంది. గతంలో ఇది ఎందుకు జరగలేదు?. అప్పుడు నేరుగా గత పాలకుల చేతుల్లోకి డబ్బులు పోయేవి. గతంలో జరగనిది.. ఇప్పుడు మీ బిడ్డ పాలనలో జరుగుతుంది.

**ఆ బాధ కూడా గత పాలకులకు లేదు..**

గతంలో మాదిరిగా మోసాలు చేసే పరిస్థితి లేదు. మాట ఇచ్చి తప్పితే.. రైతు ఏమవుతాడన్న బాధ కూడా గత పాలకులకు లేదని మనం చూశాం. అలాంటి వాళ్ల రాజకీయాలకు తగునా?. ఒక వ్యక్తి ఎలా మాట ఇచ్చాడు.. ఎలా మోసం చేశాడో మీరు చూశారు. ఆయన చంద్రబాబు నాయుడు. చంద్రబాబుకు ఏం చేస్తే మంచి జరుగుతుందని.. అది చేయడానికి ఉరుకులు పరుగులు తీసే మరో వ్యక్తి దత్తపుత్రుడు. ప్రజలను మోసం చేసి.. తోడుదొంగలైన వీరిద్దరు... రాజకీయాల్లో ఉండేందుకు అర్హులేనా?. మనం ఏదైనా ఒక మంచి కార్యక్రమం చేస్తున్నాం అంటే... దాన్ని డైవర్ట్ చేయడానికి ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఒక టీవీ-5, ఒక చంద్రబాబు, ఒక దత్తపుత్రుడు.. వీళ్లంతా ఏకం అవుతారు. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా .. అబద్ధానికి రంగులు పూస్తారు

**రైతులను నట్టేట ముంచిన ఈ చంద్రబాబు మంచోడంట..**

చంద్రబాబుగారు వచ్చినా, దత్తపుత్రుడు వచ్చినా అడగండి. మీరిచ్చిన మేనిఫెస్టోను చూసి ఓట్లేశాం.. ఆ మేనిఫెస్టోను ఎందుకు అమలు చేయలేదని అడగండి. మేనిఫెస్టోలో రైతుకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయని ఈ చంద్రబాబు మంచోడంట. రుణమాఫీ అంటూ మోసం చేసి రైతులను నట్టేట ముంచి ఈ చంద్రబాబు మంచోడంట. ఉచిత విద్యుత్, ధాన్యం, విత్తన బకాయిలను, పంటల బీమాకూడా చెల్లించకుండా బకాయిలు పెట్టి ఎగ్గొట్టిన ఈ చంద్రబాబు మంచోడంట. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశం అమలు చేశామని మేనిఫెస్టో చూపించి మీరే టిక్ పెట్టండి అని మీ ఇంటి దగ్గరకు మూడేళ్ల పాలన తర్వాత వచ్చి ఆశీస్సులను మీ బిడ్డ అడుగుతున్నాడు. ఇద్దరికీ తేడాను గమనించండి:

**రైతులను ఎందుకు రెచ్చగొడుతున్నారు..**

కోనసీమలో క్రాప్ హాలిడే అని రైతులను ఎందుకు రెచ్చగొడుతున్నారు. మీరు ఎగ్గొట్టిన ధాన్యం బకాయిలను జగన్ అనే నేను తీర్చినందుకా?. కేంద్రం నుంచి సకాలానికే డబ్బు రాకపోయిన 21 రోజుల్లోనే వారికి ధాన్యం డబ్బులు ఇవ్వడంకోసం



కిందా మీదా ప్రయాస పడుతున్నా.. మీ బిడ్డ ప్రయత్నాన్ని చూడలేకపోతున్నారా? అంటూ ఇదే చంద్రబాబును, మీ దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌ని అడుగుతున్నాను.

**మార్పులను తట్టుకోలేక రాజకీయాలు..**

2 సంవత్సరాల కోవిడ్ తర్వాత టెన్త్‌పరీక్షలు జరిగాయి. పరీక్షలు లేకుండా పాస్ చేసుకుంటూ రెండేళ్లు వచ్చాం. 67శాతం మంది ఉత్తీర్ణులు అయ్యారు. గుజరాత్‌లో 65శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రెండేళ్ల తర్వాత పరీక్షలు రాసిన పిల్లలకు ఆత్మస్థైర్యం కల్పించే మాటలు చెప్పాలి. సప్లిమెంటరీ తీసేసి.. రెగ్యులర్‌గానే వారిని భావిస్తూ వారికి మళ్లీ పరీక్షలు పెడుతున్నాం. ఆ పిల్లలను సైతం రెచ్చగొట్టడానికి, చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. మన పిల్లలకు ఇవ్వాల్సింది క్వాలిటీ చదువులు. ప్రపంచంతో పోటీపడేటప్పుడు వారి చదువుల్లో క్వాలిటీ ఉండాలి. విద్యారంగంలో తీసుకు వస్తున్న మార్పులను తట్టుకోలేక దాన్ని కూడా రాజకీయంచేస్తున్నారు.

**సామాజిక న్యాయానికి నిజమైన అర్థం చెప్తున్నాం..**

కోనసీమ జిల్లాకు అంబేద్కర్ అనే మహానుభావుడి పేరును పెట్టాం. ఒక దళిత మంత్రి, బీసీ మంత్రి ఇళ్లను కాల్చేశారు. ఒక జిల్లాకు అంబేద్కర్ కోనసీమ జిల్లా అని పేరుపెడితే జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదా సామాజిక న్యాయం?. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండేందుకు అర్హులేనా?. మీ బిడ్డ మంత్రివర్గంలో 70శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మంత్రులుగా ఉన్నారు. సామాజిక న్యాయానికి నిజమైన అర్థం చెప్తున్నాం. ఉద్యోగుల విషయంలో కూడా ఇదే ధోరణి. ఉద్యోగలకు ప్రతి విషయంలో మంచి చేస్తున్నాం. ఇంతకు ముందు ఎవ్వరూ కూడా సాహసం చేయలేదు. వారికి మంచి జరుగుతుందని వారికి నచ్చజెప్పి, వారిని కలుపుకుంటూ పోతే.. వారినికూడా రెచ్చగొట్టే దిక్కుమాలిన ఆలోచన చేస్తున్నారు. వీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. మీ బిడ్డ ఎదుర్కోగలడు. దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులతో మీ బిడ్డ ఎవ్వరినైనా ఎదుర్కోగలడని" సీఎం జగన్ అన్నారు.

# బీసీల జన గణనను వెంటనే చేపడతారా.. లేక అగ్రకుల పాలకులు గద్దె దిగిపోతారా...

విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : బీసీ జన రక్షణ సమితి జాతీయ కన్వీనర్ దాన గౌడ్ ఉద్ఘాటన బీసీల జనగణన ను వెంటనే ప్రారంభించాలని లేకుంటే అగ్రకుల బూర్జువా పాలకులు గద్దె దిగి పోవాలంటూ బీసీ జన రక్షణ సమితి జాతీయ కన్వీనర్ దాన గౌడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్రంగా హెచ్చరించారు. విజయవాడలోని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 54 శాతంగా ఉన్న బీసీలకు విద్యా ఉద్యోగాలలో కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తమ జనాభా దామాషా మేరకు 54 శాతానికి వాటిని పెంచాలని డిమాండ్ చేశారు . అంతేగాక దేశ సంపదలోనూ చట్టసభలలోనూ అదేవిధంగా వాటా కోటాలను కేటాయించాల్సిందే అంటూ ఖరాఖండీగా వారు తేల్చి చెప్పారు. అందుకు బీసీ కులాల జనగణను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా వారు మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణలో ఎస్సీ ఎస్టీ కులాల జన గణనను చేపట్టినట్లే బీసీ కులాల జన గణనను చేపట్టడానికి అగ్రకుల బూర్జువా భూస్వామ్య పెత్తందారీ పాలకులు ఎందుకు భయపడుతున్నారో చెప్పాలన్నారు. బీసీ కులాల జనగణను వెంటనే చేపట్టకపోతే బీసీలంతా ఐక్యమై దళితులు గిరిజనులు మైనారిటీలను అగ్రకుల పేదలు మహిళల్ని అభ్యుదయవాదులు అందరినీ కలుపుకొని ప్రజాస్వామ్యయుతంగా ఓటు ఆయుధంతోనే అగ్రకుల బూర్జువా భూస్వామ్య ప్రభుత్వాలను పడగొడతామని అన్ని స్థాయిలలో రాజ్యాధికారాన్ని సాధించుకుంటాం అన్నారు. అందుకు పేదలు బడుగు బలహీన వర్గాల ప్రజ లంతా చైతన్యంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితిని బలోపేతం చేస్తూ ముందడుగు వేయాల్సిందిగా బహుజన వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు .ఇంకా ఈ సమావేశంలో శ్రీనివాస్ రమేష్ కృష్ణ డేవిడ్ హుస్సేన్ ఆంతోని రాజు తదితర పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నాయకులు పాల్గొని ప్రసంగించారు

# ప్రజలపై బాదుడే బాదుడు

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**



నరసరావుపేట. జూన్ 14.(ప్రజాపాలన ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పై బాదుడే బాదుడు.. దంచుడే దంచుడు అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఎద్దేవా చేశారు. టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆర్టీసీ,విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు,చెత్త, ఇంటి పన్ను ఇలా ప్రతి కుటుంబం నుంచి రూ.లక్ష దోచుకుంటున్నారని ఆరోపించారు. నరసరావుపేట మండలంలోని పాలపాడు గ్రామంలో 'బాదుడే బాదుడు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో పాటు విద్యుత్ కోతలకు రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అన్ని రంగాలను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు,టీడీపీ రాష్ట్ర నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు,నల్లపాటి రాము,మన్నన్ షరీఫ్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులిమి రామిరెడ్డి,యార్లగడ్డ లింగయ్య,పత్తి శ్రీనివాస్ రావు, పెద్ద రెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ ఇండ్లమూరి, గంగుల పెద్దిరెడ్డి,పోనుగోటి శ్రీనివాస్ రావు మరియు గ్రామంలోని టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జల్లయ్య యాదవ్ మృతి ప్రభుత్వ హత్య

**తెలుగుదేశం పార్లమెంటరీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు**





పల్నాడు జిల్లా. జూన్ 14.(ప్రజాపాలన ప్రతినిధి): టిడిపి నాయకుడు కంచర్ల జల్లయ్య యాదవ్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, దోషులను కఠినంగా శిక్షించి ప్రభుత్వం జల్లయ్య కుటుంబానికి ?కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని పల్నాడు జిల్లా, విశాఖ జిల్లాల టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు జీ. వీ. ఆంజనేయులు, వళ్ళ శ్రీనివాసులు,. వై.నాగేశ్వరరావు యాదవ్ రాష్ట్ర బి.సి సాధికార యాదవ కన్వీనర్. మల్లికార్జున నంద్యాల జిల్లా టీడీపి బీసీ కమిటీ అధ్యక్షులు.డిమాండ్ చేశారు.విశాఖ, కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి బీసీ సంఘాల నేతలు సోమవారం బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామాన్ని సందర్శించి జల్లయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజ్యమేలుతోందని సీఎం జగన్ మోహన్ రెడ్డి తన ఫ్యాక్షన్ నిజాన్ని చూపుతూ టీడీపీకి పట్టుకొమ్మలైన బీసీలను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. 25 మంది బీసీలను హత్య చేసి సామాజిక న్యాయం అంటూ సీఎం జగన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. జల్లయ్య యాదవ్ హత్య కేసును నీరుగార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సీఎం సహకారంతోనే జరుగుతోందని ఆరోపించారు. నేరస్తులకు సబ్ జైలు లో రాజభోగాలు కల్పిస్తూ జల్లయ్య యాదవ్ కుటుంబ సభ్యులైన ఆవుల పెద్ద సైదులు, మంగారావులను జిల్లా ఎస్పీ పిలిపించి విచారించడంలో ఉద్దేశం ఏంటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొందరు పోలీసు అధికారులు వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల్లయ్య ఊరు వదిలి వేరొక ఊరిలో తలదాచుకుంటే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలిపించి రాజీ చేసి నమ్మించి భరోసాను ఇచ్చి మట్టుబెట్టడం అత్యంత దుర్మార్గమని ఉన్నారు. రాజకీయ లబ్ధి కోసం వైసిపి బీసీ ల మధ్య విభేదాలు సృష్టించి ఉసిగొలిపి హత్యలు చేయిస్తుందని,ఇందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టీడీపీకి పట్టుకొమ్మలు అయినా బీసీల తలలు నరికే ఎందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి వైసీపీ ఎమ్మెల్యే లకు పని కల్పించారని ఆరోపించారు. కేసుల్లో లేని వారిని గురించి అసలు దోషులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జల్లయ్య టిడిపి 60 లక్షల కుటుంబాల్లో ఒకరిని పార్టీ అండగా నిలిచి ఆదుకుంటుందని తెలిపారు. సామాజిక న్యాయం అంటే ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,ముస్లిం మైనారిటీలను హతమార్చడం వేనా అని ప్రశ్నించారు. జల్లయ్య ,చంద్రయ్య, సుబ్బయ్య లను చంపితే టిడిపి పోతుందని అనుకోవటం అవివేకమని, ఇలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు,బత్తిన వెంకట రాయుడు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శివలసల రామకృష్ణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి.ఎం ప్రభాకర్ యాదవ్ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నంద్యాల జిల్లా. మాదన్న కోశాధికారి నంద్యాల జిల్లా. గోవిందు నంద్యాల టిడిపి జిల్లా కార్యదర్శిటి మహేష్ నాడు తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి మల్లయ్య తెలుగు రైతు విభాగం పట్టణ ప్రెసిడెంట్ నంద్యాల.సి గోవిందు నంద్యాల టిడిపి జిల్లా కార్యదర్శి.టీ మహేష్ నాయుడు తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి మల్లయ్య తెలుగు రైతు విభాగం పట్టణ ప్రెసిడెంట్ప్రె రామాంజనేయులు బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నంద్యాల.కాసర్ల ప్రసాద్ మాజీ కార్పొరేషన్ 72 డివిజన్ విశాఖ మరియు విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి బోండా జగన్ కార్పొరేటర్ జివిఎంసి 87 డివిజన్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తమ్మిన విజయ్ విశాఖ పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు. కతూరు మధు నంద్యాల జిల్లా కార్యదర్శి. జై గంగాధర్ గౌడ్ పాణ్యం యూత్ అధ్యక్షులు కే మహేష్ గౌడ్ పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ రాష్ట్ర పార్టీ సెక్రటరీ.జి మల్లయ్య తెలుగు అధ్యక్షులు డోన్ నియోజకవర్గం జిల్లెల్ల రాములు ఆంధ్రప్రదేశ్ టీడీపీ కార్యదర్శి. సీనియర్ నాయకులు పెసలు వెంకటనారాయణ మరియు మండల పార్టీ అధ్యక్షుడు జరపాలి గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఉచిత పంటల భీమా పథక కార్యక్రమంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను




మైలవరంజూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని సోమవారం ముఖ్యమంత్రి లాంఛనంగా కర్నూలులో ప్రారంభించారు అదేవిధం గా రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ఈ కార్యక్రమాన్ని ప్రా రంభోత్సవం గావించారు దీనిలో భాగంగా మైలవరం పట్టణంలో ఎస్ వి ఎస్ కళ్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు తో కలిసి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం



నరసాపురం, జూన్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం నరసాపురం మండలం సీతారాంపురంలోని స్వర్ణాంధ్రా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నరసాపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ ఆనంద్ చక్రధర్, ఐసిటిసి మెడికల్ కౌన్సిలర్ జి జేసుప్రసాద్ బాబులు పాల్గొని రక్తదానంపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తదానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించి మరింత మంది ప్రజల ప్రాణాలు కాపాడడం రక్తదాతల దినోత్సవం జరుపుకోవడం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు. 17 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు రక్తదానం చేయకూడదని అదేవిధంగా 45 కేజీల కన్నా ఎక్కువ బరువు ఉన్నవారు మాత్రమే రక్తదానం చేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర విద్యాసంస్థల కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కె.వి. స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, ఎస్ అండ్ హెచ్ విభాగాదిపతి స్వామినాథన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.మాణిక్యాలరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురి తెదేపా నేతలకు మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పరామర్శ



నందిగామ జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి: ఇటీవల కాలంలో అనారోగ్యం పాలైన పలువురు నేతలను మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు వారిలో ఈమని సూర్యనారాయణ,చంద్ర శ్రీనివాస రావు, కొల్లూరు వెంకటేశ్వరరావు గార్లను వారి స్వ గృహంలో కలుసుకొని వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మరియు తెదేపా నేత లు పాల్గొన్నారు.

## రైతన్నలకు అండగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి:ఏరువాకతో సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారాన్ని రైతన్నలకు అందిస్తున్నారని, 2021 ఖరీఫ్‌లో వైపరీత్యా లు ,చీడపీడల వల్ల పంట నష్టపోయిన చరిత్రలో ఎన్న డూ లేని విధంగా ఎన్టీఆర్ జిల్లాకు 123 కోట్ల రూపా యలు అలాగే నియోజకవర్గ వ్యాప్తం గా 7340 మం ది రైతులకు గాను 64 కోట్లు రూలి మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 15.61 లక్షల మంది రైతన్నలకు రూ.2,97 7.82 కోట్ల,భీమా పరిహారాన్ని ఈరోజు సత్యసాయి జి ల్లా చెన్నే కొత్తపల్లిలో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతన్నల ఖాతాలో జమ చే యడం జరిగిందని.సాగు చేసిన ప్రతి ఎకరాన్ని ఆర్బీ కేల ద్వారా ఈ%--%క్రాప్‌లో నమోదు చేయించి బీమా రక్ష ణ కల్పిస్తోందని, బీమా పరిహారం సొమ్ము కూడా పూ ర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని,గత ప్రభుత్వంలో పంట నష్టాల అంచనా అశాస్త్రీయంగా ఉండేది .అ యి న వారికే పరిహారం అందేది అని, రైతన్నలు ప్రభుత్వ ఉద్యోగుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి ఏర్పడేద ని.ద ళారులను ఆశ్రయించి, లంచాలు ఇస్తే అరకొరగా అం దేదని.ఇప్పుడా పరిస్థితి లేదు. చీడ పీడలు, అకాల వర్షాలు, వరదలు, కరువు కాటకాల వల్ల ఏ కష్టమొ చ్చినా, ఏ నష్టం జరిగినా ఆదుకోవాలన్న తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతులకు అన్ని విధాలుగా అండదండగా నిలుస్తున్నారని ఒక ప్రకటనలోప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను త తెలియజేశారు.




"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

**సంపాదకీయం**

బుధవారం 15, జూన్ 2022

## వలస గండాల్లో గుత్తికోయలు

ఆదివాసీ రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో 2005లో హింసాకాండ హఠాత్తుగా పెచ్చరిల్లింది. మావోయిస్టు వ్యతిరేక సల్వాజుడుంకు ప్రభుత్వ మద్దతు కారణంగానే ఆ హింసాగ్నులు ప్రజ్వరిల్లాయి. ఆ దారుణకాండలో దాదాపు 55,000 మంది గిరిజనులు తమ ఇళ్లను, ఊళ్లను వదిలివేసి పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పలాయనమై అక్కడే శరణార్థులుగా ఉండిపోయారని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని దండకారణ్య దక్షిణ ప్రాంతాలకు గుత్తికోయల (ఛత్తీస్‌గఢ్‌లో వీరిని 'మురియా'లుగా పిలుస్తారు) ఆర్థిక వలసలు ఏనాటి నుంచో కొనసాగుతూ వస్తున్నాయి. అయితే పొరుగు రాష్ట్రాలు అయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వలసపోయిన వారిలో 90 శాతం మంది ఛత్తీస్‌గఢ్‌లో ఎడతెగని హింసాకాండ వల్లే ఆయా రాష్ట్రాలకు వెళ్లడం జరిగిందని గుత్తికోయలే స్వయంగా చెపుతున్నారు. ఇటీవల 'మిషన్ కశ్మీర్' అనే సినిమా కశ్మీరీ పండిట్‌ల నిర్బంధ వలసల దుస్థితిని ప్రపంచం దృష్టికి తెచ్చింది. అయితే గుత్తికోయల వలస కడగండ్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. అదొక అజ్ఞాత విషాదగాథగా మిగిలిపోయింది. కశ్మీర్ ఉగ్రవాదుల వలే మావోయిస్టులు కూడా, ఛత్తీస్‌గఢ్‌లోని స్వస్థలాలకు తిరిగిరాదలుచుకున్న ఆడవి బిడ్డలను అంతమొందిస్తున్నారు. ఈ అమానుషాలు ప్రింట్ మీడియాలో కనీసం వార్తలు కూడా కావడం లేదుబీ ఎలక్ట్రానిక్ మీడియాలో కనిపించనే కనిపించడం లేదు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఆదివాసీల వలసల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనేంతవరకు పరిస్థితులు యథాతథంగా కొనసాగేలా చూడాలని తెలంగాణ హైకోర్టు 2018లో ఆదేశించింది. వలస వచ్చిన వారి చేతుల్లో ఉన్న భూములను తిరిగి తీసుకోవడం గానీ, వారి ఇళ్లను ధ్వంసం చేయడానికి గానీ పూనుకోవద్దంటూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాన్ని పాటించడం లేదు. వలస వచ్చిన వారు ఆక్రమించుకున్న అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు 'హరిత హారం' కార్యక్రమాన్ని ఒక సాకుగా ఉపయోగించుకుంటోంది. కరోనా ఆపత్సమయంలో ప్రారంభమైన ఈ పునఃస్వాధీన కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలసకారులు తాము అక్రమంగా ప్రవేశించిన అటవీ భూములపై ఎలాంటి యాజమాన్య హక్కులు కలిగిలేరు. ఇది స్పష్టం. అయితే మొక్కలు నాటే కార్యక్రమం (ఇదే హరితహారం) పేరిట ఆ అటవీ భూములను తిరిగి కైవసం చేసుకోవడమనేది తెలంగాణ హైకోర్టు ఉత్తర్వును ఉల్లంఘించడమే. 2018లో తెలంగాణ హైకోర్టు ఆదేశం జారీ అయిన తరువాత వలసకారులు తాము కబ్జాచేసిన అడవులను నరికివేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నిజం లేశ మాత్రం లేని వివరణలు ఇస్తోంది. కరోనా కార్చిచ్చు ప్రారంభం కాకముందు మిజోరం, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి బ్రూ తెగ గిరిజనుల పునరావాసానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రణాళికను ప్రకటించింది. మిజోరంలో ఆదివాసీ తెగల మధ్య ఘర్షణల మూలంగా బ్రూ గిరిజనులు చాలా కాలం క్రితమే త్రిపురకు బలవంతంగా వలసపోయారు. అలా వలసవెళ్లిన వారిలో కొంత మంది తిరిగి మిజోరంకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. వెనక్కి వెళ్లిపోయేందుకు నిరాకరించిన వారు కేంద్ర ప్రభుత్వం నుంచి నగదు రూపేణా నష్ట పరిహారాన్ని అంగీకరించారు. సరే, ఛత్తీస్‌గఢ్ నుంచి వలసలు ఆగలేదు. వలస వేదనలకు అంతముంటుందా? ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నివశిస్తున్న గుత్తికోయలకు స్వస్థలాలలో పునరావాసం కల్పించే విషయమై సంబంధిత రాష్ట్రాలు అన్నిటితోనూ చర్చలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన సమయమాసన్నమయింది. ప్రజా సంఘాలు ఈ విషయమై కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేయాలి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పాలకులు ఈ విషయంలో ఎటువంటి శ్రద్ధ చూపడం లేదు. ఛత్తీస్‌గఢ్‌కు తిరిగిరాదలుచుకున్న వలసకారుల పునరాగమనానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే మావోయిస్టులకు ఈ ప్రకటన ఎంతమాత్రం అంగీకారయోగ్యంగా లేదు. ఆ నిర్ణయం అమలుకు ప్రభుత్వం చేపట్టే చర్యలను విఫలం చేసేందుకు వారు ఉద్యుక్తులై ఉన్నారు. కారణమేమిటి? భవిష్యత్తులో తాము ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు తిరిగి వెళ్లేందుకై వలసపోయిన గుత్తికోయ గిరిజనులను ఉపయోగించుకోవాలనే ఆలోచనలో మావోయిస్టులు ఉన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసధికారులు కూడా ఆదివాసీ వలసకారుల మూలంగా మావోయిస్టుల బెడద పెరుగుతుందని భయపడుతున్నారు. ఈ కారణంగా ఆ నిస్సహాయ గిరిజనులను ఛత్తీస్‌గఢ్‌కు బలవంతంగానైనా సరే పంపించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఇదొక సంక్లిష్ట సమస్య. చాలామంది వలసకారులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఇప్పటికీ అక్కడ హింసాకాండ ప్రజ్వరిల్లుతూనే ఉంది. దాన్ని తప్పించుకోవడానికే అన్నీ వదులుకుని కన్న ఊళ్ల నుంచి వచ్చి, పరిస్థితులు ఏ మాత్రం మారకుండానే అక్కడికి తిరిగిపోవడమెందుకని వారు ఆలోచిస్తున్నారు. గత పదిహేనేళ్లలో ప్రభవించిన కొత్తతరం వారు స్వరాష్ట్రంలో కంటే ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే తమకు అపార అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ ఆదివాసీ వలసకారులలో అత్యధికులు తెలంగాణలోనే ఉన్నందున, సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా కేంద్రంపై ఆ రాష్ట్రమే ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. దక్షిణాది రాష్ట్రాలు తమ రాష్ట్రానికి 'విప్లవకారుల'ను ఎగుమతి చేస్తున్నాయని, తత్కారణంగానే వాటికి వలసకారుల సమస్య అనివార్యమవుతోందని ఛత్తీస్‌గఢ్ అధికారులు కొంతమంది వ్యక్తిగత చర్చల్లో వ్యాఖ్యానిస్తున్నారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకునేందుకు అవసరమైన సమాచారం అందుబాటులో లేదు. నక్సలైట్ల హింసాకాండ మూలంగా ఒక్క వ్యక్తికూడా ఇరుగు పొరుగు రాష్ట్రాలకు వెళ్లలేదని, కనుక రాష్ట్రంలో వారికి పునరావాసం కల్పించే ప్రసక్తి అంటూ లేదని 2021లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఒక ప్రశ్నకు సమాధానంగా హోం మంత్రి తెలిపారు. వలసకారులు తెలంగాణలోనే అత్యధికంగా ఉన్నప్పటికీ వారి సంఖ్య ఎంత అనేది కచ్చితంగా తెలియదు. వలసకారులు అడవులను నరికివేస్తున్నారనే మాట గట్టిగా వినిపిస్తోంది. అయితే తమ జిల్లాలో అటవీ భూములను చట్టవిరుద్ధంగా ఆక్రమణకు గురైన అటవీ భూములలో కేవలం ఎనిమిదో వంతు మాత్రమే వలసకారుల అధీనంలో ఉన్నాయని ఒక జిల్లా ఉన్నతాధికారి చెప్పాడు. హింసాకాండ మూలంగా ఎంతమంది వలస వెళ్లారో కచ్చితంగా లెక్క తీయాలని 2019లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని జాతీయ షెడ్యూల్డ్ తరగతుల కమిషన్ ఆదేశించింది. ఈ విషయమై తాము రాసిన లేఖలకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదని ఛత్తీస్‌గఢ్ చెప్పింది. చట్ట విరుద్ధంగా స్థానభ్రంశం చెందిన లేదా తమ ఆక్రమణలో ఉన్న అటవీ భూముల నుంచి గెంటివేయబడ్డ ఆదివాసీలకు ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని అటవీహక్కుల చట్టంలోని నిబంధన 3.1.ఎమ్ నిర్దేశించింది. ఈ నిబంధనను తమకు వర్తింపచేయాలని వెయ్యి మందికి పైగా వలసకారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే సంవత్సరాలుగా అవి అటక మీద దుమ్ముకొట్టుకుని పోతున్నాయి. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన ప్రజల (ఇంటర్నల్లీ డిస్‌ప్లేస్డ్ పీపుల్–) విషయంలో భారత్‌కు ఒక జాతీయ విధానం లేదు. రాజకీయ, సామాజిక సంఘర్షణలు, హింసాకాండతో అనివార్యంగా వలస వెళ్లవలసి వచ్చిన లేదా స్వస్థలాల నుంచి గెంటివేతకు గురైన వారి సమస్యలకు సంబంధించిన ఏ అంతర్జాతీయ ఒడంబడికలోనూ మనం భాగస్వాములుగా లేము. ఈ నిరాశ్రయుల విషయమై కేంద్రం ఒక సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాలే సరైన సమయం, సందర్భం. ఒక సమగ్ర జాతీయ విధానాన్ని అనుసరించడానికి బదులుగా విడి విడి రాష్ట్రాల ఇష్టాయిష్టాలు, నిరాధార నమ్మకాలకు వలసవెళ్లిన అభాగ్యగతుల శ్రేయస్సును ఎందుకు వదిలివేయాలి?

# బీజేపీయే భారత్ భవిష్యత్తు



'మీఅంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి ఓటు వేయండి..' అని 1969లో అధికార కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని ఓడించడానికి ఇందిరాగాంధీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో వృద్ధ నేతలతో కూడిన సిండికేట్ నిర్ణయించిన అభ్యర్థిని ఓడించడానికి ఆమె వివి.గిరిని అధికార అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుని పార్టీలో తనదే పైచేయిగా నిరూపించుకున్నారు. ఇవాళ కాంగ్రెస్‌లో వృద్ధులే తప్ప యువకులు మిగలని పరిస్థితుల్లో ఆ పార్టీ నేతలే అదే అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి దేశ భవిష్యత్తు బిజెపిలోనే ఉన్నదని భావిస్తున్నారు. తాజాగా ముగిసిన రాజ్యసభ ఎన్నికలు ఈ పరిణామాన్ని నిరూపిస్తున్నాయి. 'నా అంతరాత్మ ప్రభోధాన్ని అనుసరించి ఓటు వేశాను' అని హర్యానాలో మాజీ ముఖ్యమంత్రి భజన్‌లాల్ కుమారుడు కుల్దీప్ సింగ్ బిష్ణోయ్ ప్రకటించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన ఆయన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు. కాని ఆయన బిజెపి మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి కార్తికేయ శర్మకు ఓటు వేయడంతో కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్ పరాజయం పాలయ్యారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ఒక అధికార ప్రతినిధినే గెలిపించుకోలేని దుస్థితిని కాంగ్రెస్ ఎదుర్కొన్నది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు బిష్ణోయ్‌ను కాంగ్రెస్ పార్టీనుంచి బహిష్కరించింది. ఏమి ప్రయోజనం? 'మీ అంతరాత్మ ప్రభోధాన్ని అనుసరించి ఓటు వేయండి..' అని కర్ణాటకలో కాంగ్రెస్ అధ్యక్షుడు డికె శివకుమార్ పిలుపునిచ్చారు. కర్ణాటకలో ఒక సీటుకంటే ఎక్కువ గెలిచే అవకాశాలు లేకపోయినా కాంగ్రెస్ రెండో అభ్యర్థిని నిలబెట్టింది. అదే విధంగా జనతాదళ్ (ఎస్) తమకు ఒక్క సీటు రాదని తెలిసినా తమ అభ్యర్థిని పోటీలో దించింది. బిజెపి తమకు రెండు సీట్లు మాత్రమే వచ్చని తెలిసినప్పటికీ ప్రతిపక్షాలను చిత్తు చేయడానికి మూడో అభ్యర్థితో పోటీ చేయించింది. చివరకు జరిగిందేమిటి? కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్)కు చెందిన కనీసం పది మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి బిజెపి మూడో అభ్యర్థికి ఓటు వేశారు. బిజెపి అభ్యర్థి విజయావకాశాలను దెబ్బతీయాలనుకున్న కాంగ్రెస్ కుతంత్రాలు ఫలించలేదు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయి, మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్పతో పాటు బిజెపి నేతలంతా కలిసికట్టుగా వ్యూహరచన చేస్తే కాంగ్రెస్, జనతాదళ్ (ఎస్) శిబిరాల్లో తమ ఎమ్మెల్యేలను కూడా కాపాడుకోలేకపోయారు. మహారాష్ట్రలో కూడా ఇదే జరిగింది. చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బిజెపికి మద్దతునీయడంతో ఆ పార్టీకి చెందిన మూడో అభ్యర్థి ధనంజయ్ మహాదిక్ విజయం సాధించారు. శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్‌లతో కూడిన మూడు పార్టీల కూటమి మహారాష్ట్ర వికాస్ ఆఘాడి విశ్వయత్నం చేసినా బిజెపి అదనపు అభ్యర్థి విజయాన్ని అడ్డుకోలేకపోయారు. 29 మంది ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల్లో 17 మంది తమ అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించి బిజెపి అభ్యర్థికి ఓటువేశారు. మూడేళ్ల క్రితం ఎన్డీఏ నుంచి వైదొలగి, అధికారం కోసం కాంగ్రెస్, ఎన్‌సిపి వంటి అరాచక శక్తులతో చేతులు కలిపి సిద్ధాంతాలను త్యాగం చేసిన శివసేనకు వారు బుద్ధి చెప్పారు. 2019లో జరిగిన ఈ పరిణామం తర్వాత రాజ్యసభ ఎన్నికల్లో నైతిక విజయం లభించడం బిజెపి నేతల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్‌లోనూ, ఇతర పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు ఈ ఎన్నికల్లో బహిర్గతమయ్యాయి. కాని రాజ్యసభ ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాల్లో బిజెపి తన బలాన్ని చెక్కు చెదరకుండా కాపాడుకోవడమే కాకుండా చిన్న పార్టీలు, స్వతంత్రులను తమకు అనుకూలంగా మార్చుకోగలిగింది. కేంద్రమంత్రులు పీయుష్ గోయెల్, నిర్మలా సీతారామన్‌లతో పాటు అనేక బలహీన వర్గాలకు, ఆదివాసీలకు చెందిన నేతలను కూడా బిజెపి గెలిపించుకోగలిగింది. తెలంగాణకు చెందిన సీనియర్ నాయకుడు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను ఉత్తరప్రదేశ్ నుంచి గెలిపించుకుని దేశంలో వివిధ ప్రాంతాలకు, వర్గాలకు సమాన న్యాయం చేయగలిగిన పార్టీగా నిరూపించుకుంది. లక్ష్మణ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగానే కాకుండా గత కొన్ని దశాబ్దాలుగా పార్టీని తెలంగాణలో బలోపేతం చేసేందుకు నిర్విరామంగా కృషి చేశారు. బిజెపిలో పార్టీ కోసం కృషి చేస్తున్న వారికి ఎప్పటికైనా న్యాయం లభిస్తుందనడానికి లక్ష్మణ్‌ను రాజ్యసభకు ఎంపిక చేయడం ఒక ఉదాహరణ. ఆయన ఎంపికతో తెలంగాణలో బలహీనవర్గాలకు ఒక గొప్ప ఉత్సాహాన్ని అందించింది. ఇవాళ తెలంగాణలో పెరిగిపోతున్న బలహీనవర్గాల ఆకాంక్షలకు ప్రతిఫలంగా బిజెపి నిలిచిందనడంలో సందేహం లేదు. దాదాపు అన్ని వర్గాలనుంచీ బిజెపికి ఉధృతంగా లభిస్తున్న మద్దతు కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీస్తున్న ప్రభంజనానికి తార్కాణం. తన అవినీతి, బంధు ప్రీతి సామ్రాజ్యం కుప్పకూలిపోయే రోజులు ఆసన్నమవుతున్నాయని కేసిఆర్‌కు అర్థమవుతోంది. ఈ పరిణామాలతో దిక్కుతోచని స్థితిలో పడినందువల్లే కేసీఆర్ జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతానంటూ బయలు దేరారు. టీఆర్ఎస్‌ను భారత రాష్ట్ర సమితిగా మారుస్తానని ఆయన ప్రగల్భాలు పలకడం విరాటపర్వంలో ఉత్తర కుమారుడి ఉదంతాన్ని స్ఫురిస్తున్నది. జాతీయ స్థాయిలో గాలిలో కత్తి తిప్పినంత మాత్రాన తెలంగాణ ప్రజలు గత ఎనిమిది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన వేలకోట్ల అవినీతిని, కుటుంబ ఆధిపత్యాన్ని, అణిచివేతను, అస్తవ్యస్థ ఆర్థిక పరిస్థితులను మరిచిపోతారనుకోవడం, తమకు జీతాలు కూడా సకాలంలో అందడం లేదని వాపోతున్న ఉద్యోగులు కెసీఆర్‌కు అండగా నిలుస్తారనుకోవడం అమాయకత్వం. ఇటీవల రాష్ట్ర రాజధాని నడిబొడ్డున పట్టపగలు ఆరుగురు దుండగులు ఒక అమ్మాయిని కిడ్నాప్ చేయడవే కాకుండా సామూహిక అత్యాచారం జరిపిన తీరు తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉన్నదో స్పష్టం చేస్తున్నది. ఈ రాజ్యసభ ఎన్నికల ఫలితాలు రానున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికి ఘనవిజయం సాధించేందుకు ఉపోద్ఘాతమని వేరే చెప్పనక్కర్లేదు. రాజ్యసభలో 1988 తర్వాత ఒక పార్టీ ఇలా వంద సీట్లకు చేరుకోవడం ఒక చరిత్రాత్మక పరిణామం. అనేక మిత్రపక్షాలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్రులు బిజెపి వైపు మొగ్గుచూపుతున్నందువల్ల రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయానికి ఎటువంటి ఢోకా ఉండదన్న విషయం స్పష్టమవుతోంది. ఇవాళ ప్రజల అంతరాత్మ ప్రభోధమే నరేంద్రమోదీ సారథ్యంలో కమల వికాసానికి దోహదం చేస్తోంది. ప్రజల అంతరాత్మలో మోదీ, మోదీ అన్న నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

# తగునా ఇది కాంగ్రెస్!

దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ సోమవారం 'సత్యాగ్రహ' ఉద్యమంతో హోరెత్తించింది. 'నేషనల్ హెరాల్డ్' కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రశ్నించడం ఆ పార్టీకి ఆగ్రహం కలిగించింది. ఇదే కేసులో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కూడా ఈడీ ప్రశ్నించాల్సి ఉంది. అయితే ఆమె అస్వస్థతతో ఆసుపత్రిలో చేరడంతో సాధ్య పడలేదు. దశాబ్దాలపాటు దేశాన్నేలి ఎనిమిదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్‌కు సమీప భవిష్యత్తులో గత వైభవం దుర్లభమని పదే పదే రుజువవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీ నిర్వహించిన తాజా ఉద్యమం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈడీ, సీబీఐ, ఐటీ తదితర విభాగాలు అధికార పక్షానికి ప్రత్యర్థులైనవారిని వేధించడం రివాజుగా పెట్టుకున్నాయని చాన్నాళ్లుగా ఆరోపణలున్నాయి. ఆ మాటకొస్తే అధికారంలో ఉండగా ఇలాంటి సంస్కృతికి అంకురార్పణ చేసింది కాంగ్రెస్సే. సర్వోన్నత న్యాయస్థానవే ఒక సందర్భంలో సీబీఐని 'పంజరంలో చిలుక'గా అభివర్ణించాల్సి వచ్చింది. అటువంటి పార్టీకి తమ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించడం అభ్యంతర కరం అనిపిస్తోంది. ఏ సమస్యపైన అయినా ఉద్యమించడం ఒక రాజకీయ పక్షంగా కాంగ్రెస్ హక్కు. కాదనలేం. కానీ పోయి పోయి ఎన్నో లొసుగులతో నిండివున్న 'నేషనల్ హెరాల్డ్' కేసు విషయంలో ఇంతగా రాద్ధాంతం చేయడమేమిటన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. 'నేషనల్ హెరాల్డ్' చరిత్ర సమున్నతమైనది. కాంగ్రెస్ సారథ్యంలో సాగుతున్న స్వాతంత్ర్య సమరంలో దేశ ప్రజానీకాన్ని చైతన్యవంతులను చేయడం కోసం ఆ పత్రిక ఆవిర్భవించింది. ఎంతో సదాశయంతో ప్రారంభించిన ఆ పత్రిక చుట్టూ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంబరాలు సాగుతున్న వర్తమాన తరుణంలో వివాదాలు ముసురుకోవడం బాధాకరమే. కానీ అందుకు పూర్తి బాధ్యత సోనియాగాంధీ, రాహుల్ గాంధీలదే. సుదీర్ఘకాలం నడిచి మూతబడిన 'నేషనల్ హెరాల్డ్', దాని అనుబంధ పత్రికలైన క్వామీ ఆవాజ్ (ఉర్దూ), నవజీవన్ (హిందీ)ల విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై అందరికన్నా ముందు నిలదీసింది బీజేపీ నేతలు కాదు... కేంద్ర మాజీ న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ. మేధావులుగా, నైతిక వర్తనులుగా పేరుప్రతిష్ఠలున్న వీరిద్దరికీ బీజేపీపై ఉన్న వ్యతిరేకత ఎవరికీ తెలియంది కాదు. వారి అభ్యంతరాలను కాంగ్రెస్ బేఖాతరు చేసినప్పుడు దీన్ని న్యాయస్థానం వరకూ తీసుకెళ్లింది మాత్రం బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామే. ఆయన 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించకపోయి ఉంటే ఈ అక్రమాలు వెలుగు చూసేవే కాదు. ఆ దశలోనైనా కాంగ్రెస్ మేల్కొనాల్సింది. అప్పటికి తానే అధికారంలో ఉన్నది కనుక సమగ్ర విచారణకు సిద్ధపడాల్సింది. తప్పని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుని అందరికీ ఆదర్శనీయం కావాల్సింది. కానీ కుంభకోణానికి మూలవిరాట్టులు తల్లీకొడుకులే అయినప్పుడు అదెలా సాధ్యం? 'నేషనల్ హెరాల్డ్' నెహ్రూ కుటుంబ సొంతాస్తి కాదు. 1937 నవంబర్‌లో నెహ్రూ చొరవతో దాదాపు 5,000 మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులుగా ఏర్పడిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) అనే సంస్థకు చెందిన పత్రిక. దాదాపు 5,000 కోట్ల ఆస్తులున్న ఆ సంస్థనుంచి తనకు రావాల్సిన రూ. 90.25 కోట్ల బకాయిలను వసూలు చేసుకునే నెపంతో కాంగ్రెస్ చేసిన ఇంద్రజాలం అసామాన్యమైనది. 2010లో రూ. 5 లక్షల మూలధనంతో యంగ్ ఇండియన్ లిమిటెడ్(వైఐఎల్) ఏర్పాటు చేయడవే కాదు... ఆగమేఘాలమీద ఏజేఎల్ ఆస్తులన్నిటిపైనా దానికి హక్కులు దఖలు పరిచేందుకు పథకం సిద్ధం చేశారు. ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల వడ్డీ రహిత రుణం ఇవ్వడం, ఆ రుణాన్ని వసూలు చేసుకునే హక్కును కేవలం రూ. 50 లక్షలకు వైఐఎల్‌కు కాంగ్రెస్ అమ్మడం, అందుకు బదులుగా ఏజేఎల్‌కున్న ఆస్తులన్నీ వైఐఎల్‌కు దఖలుపడటం ఏడాది వ్యవధిలో చకచకా జరిగిపోయాయి. వైఐఎల్‌లో సోనియా, రాహుల్ గాంధీలకు ఏకంగా 76 శాతం వాటాలుండటం... కాంగ్రెస్, ఏజేఎల్, వైఐఎల్ అనే మూడు సంస్థల్లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ సర్వం తానై వ్యవహరించింది కాంగ్రెస్ సీనియర్ నేత స్వర్గీయ మోతీలాల్ వోరా కావడం దిగ్భ్రమ కలిగిస్తుంది. ఇది ఏజేఎల్‌తోపాటు తమ నేతృత్వంలోని కాంగ్రెస్‌ను కూడా దగా చేయడమే. ఏజేఎల్‌కు 2011 నాటికి మిగిలివున్న 1,057 మంది వాటాదార్లలో ఒకరిగా శాంతిభూషణ్, కట్జూలు ఈ చాటుమాటు వ్యవహారాన్ని ప్రశ్నించారు. తమకు కనీసం నోటీసు ఎందుకివ్వలేదని నిలదీశారు. కానీ కాంగ్రెస్ మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాతైనా సచ్ఛీలతను నిరూపించుకోవాల్సింది పోయి స్టేలు తెచ్చుకుంది. దర్యాప్తును అడ్డుకోజూసింది. స్వాతంత్ర్యోద్యమం పైనా, అందులో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్‌పైనా, ప్రత్యేకించి నెహ్రూ పైనా ప్రస్తుత నాయకత్వానికి ఏమాత్రం గౌరవమర్యాదలున్నా ఇలాంటి సందేహాస్పద వ్యవహారానికి తెరతీసేదే కాదు. వేలాదికోట్ల ఆస్తులున్న సంస్థను నిలబెట్టడానికి, పత్రికలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వందలాది కుటుంబాలను ఆదుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించి ఉంటే కాంగ్రెస్ ప్రతిష్ఠ ఇనుమడించేది. అందుకు భిన్నంగా వక్రమార్గంలో పోవాలనుకోవడంతో ఆ పార్టీ నగుబాటుపాలైంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. జరిగిందేమిటో, అందులో తన నిజాయితీ ఏపాటో కాంగ్రెస్ దేశ ప్రజల ముందుంచాలి. ప్రస్తుత దర్యాప్తు ఏరకంగా కక్ష సాధింపు అవుతుందో నిరూపించాలి. ఆ పని చేయలేకపోతే కాంగ్రెస్ ప్రతిష్ఠ మరింత అడుగంటడం ఖాయం.

# నూతన పల్నాడు జిల్లాలో భద్రత పరిరక్షణ ధ్యేయంగా పలు భద్రతా చర్యలు

## పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఐపీఎస్



పల్నాడు జిల్లా . నరసరావుపేట. జూన్ 14.(ప్రజాపాలన ప్రతినిధి): నూతన పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పలు భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపిన పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఐపిఎస్ . నరసరావుపేట 1వ,2వ మరియు రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రదేశాలలో నూతనంగా అమర్చిన సుమారు 130 కెమెరాల ను రిబ్బన్ కత్తిరించి,ప్రారంభించిన ఎస్పీ . ఈ సందర్భంగా సీసీ కెమెరాలను అమర్చిన ప్రదేశాలను, వాటి వనితీరును ఎస్పీ కి వివరించిన 1 టౌన్ సీఐ అశోక్ కుమార్ , 2 టౌన్ సీఐ వెంకట్రావు . సీసీ కెమెరాలను ముఖ్యంగా ప్రధాన కూడళ్లు,జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు,రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, విద్యాసంస్థలు ఉండే ప్రాంతాలు, నడక మార్గాలు,ప్రమాదాలు జరిగే ప్రదేశాలు,నేరాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాలలో అమర్చడం జరిగినదని తెలిపిన ఎస్పీ . ఈ సీసీ కెమెరాలను మా పోలీస్ వారు నిరంతరం పర్యవేక్షిస్తారని,ప్రతి ప్రదేశం మీద పటిష్టంగా నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సీసీ కెమెరాల ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశం చైన్ స్నాచింగ్, నిర్లక్ష్యంగా మరియు ప్రమాదకరంగా వాహన చోదకం(Rash driving, snake driving), ఈవ్ టీజింగ్ వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలపాలను అరికట్టడం. లిఎవరైనా రాష్ డ్రైవింగ్,స్నేక్ డ్రైవింగ్ వంటివి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తే వారిపై కేసులు నమోదు చేసి,చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇక నుండి ఏదైనా ప్రదేశంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు,సత్వరమే ఈ సీసీ కెమెరా ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని, ఈ సీసీ కెమెరాల ఏర్పాటు వలన ప్రజలకు మరింత దగ్గరగా చేరువగా, వారికి మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. ఒక్క నరసరావుపేటలోనే కాకుండా భవిష్యత్తులో చిలకలూరపేట, గురజాల, మాచెర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల వినుకొండ వంటి ఇతర ప్రాంతాల్లో కూడా అమర్చడానికి సన్నాహాలు జరుగుతున్నా యని,వాటిని సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమము లో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)శ్రీ బిందు మాధవ్ ఐపిఎస్ , నరసరావుపేట డిఎస్పీ విజయ భాస్కర్ ,దిశా డిఎస్పీ రవిచంద్ర ,1వ పట్టణ ,2వ పట్టణ అరియు రూరల్ సీఐలు అశోక్ కుమార్ ,వెంకటరావు మరియు భక్త వత్సల రెడ్డి ,ఎస్సైలు బాలనాగిరెడ్డి రబ్బానీ ,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్



కంచికచర్ల జూన్ 14 ప్రజాపాలన ప్రతినిధి: పట్టణం లోని మండల పరి షత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారుఈ సమావేశంలో కంచికచర్ల మండల పరిధిలోని అభివృద్ధి పనులు మరియు పెం డింగ్ పనుల పై చర్చించారు , అనంతరం మండల ప రిధిలో గ్రామ సచివాలయాలు –రైతు భరోసా కేంద్రాలు – వైయస్సార్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణ పనులపై చర్చిం చారు , మండల పరిధిలోని గ్రామాలలో జగనన్న కాల నీలలో ఇళ్ళ నిర్మాణాలపై అధికారులు –స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయంతో కలిసి పనిచేసి లబ్ధి దారులు ఇల్లు నిర్మించుకునే విధంగా తోడ్పాటు అం దించాలని సూచించారు , మండల పరిధిలోని గ్రామా లలో అభివృద్ధి చేయాల్సిన డొంక రోడ్ల కు సంబంధిం చిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు , గ్రామాలలో తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందు లు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రుఈ కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ లు ,జడ్పి టిసి, ఎంపీడీవో, ఎమ్మార్వో , హౌసింగ్ అధికారులు , పలు గ్రామాల సర్పంచులు ,ఎంపీటీసీలు , వైయస్సా ర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మార్వో నరసింహారావు"



నందిగామ జూన్ 14 ప్రజా పాలన ప్రతినిధి ఇటీవల కాలంలో నందిగామ తాసిల్దార్ గా నరసింహారావు నియమితులయ్యారు ఆయన మంగళవారం స్థానిక ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారుఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మం డల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేసి మంచి ఎమ్మారో గా పేరు తెచ్చుకోవాలని సూచించారు.

## జిల్లాకు 93.18 కోట్ల పంటభీమా నిధుల విడుదల



భీమవరం, జూన్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) : వై.యస్.ఆర్ పంటల ఉచిత బీమా క్లైమ్ క్రింద జిల్లాలోని 49, 482 మంది రైతులకు రూ.93.18 కోట్లు విడుదల అయ్యాయి. ఖరీఫ్ 2021లో ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులకు పంట బీమా క్లెయిములను మంగళవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సత్యసాయి జిల్లానుండి రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి .ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఇ– క్రాపులో విధిగా నమోదు చేసుకోవాలని కోరారు. దీని వలన రైతులకు ప్రభుత్వం నుండి అన్ని రకాల ప్రయోజనాలు అందుతాయని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం తదితర అన్ని అంశాల్లో లబ్ధి పొందవచ్చని కలెక్టర్ అన్నారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె వి మురళి, ఇంఛార్జి వ్యవసాయ అధికారి ఎం వి రమేష్, నర్సాపురం ఏడిఏ కెవిఎస్ఎస్ శ్రీనివాసరావు , భీమవరం ఏడిఏ పి.ఉషారాజకుమారి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అన్నప్రాసన కార్యక్రమంలో వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి:బాపట్ల మండలం మార్రుప్రోలువారి పాలెం లో గొర్రుముచ్చు వారి అన్నప్రాసన కార్యక్రమం లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు.

## విద్యార్థులతో యోగా అవగాహన కార్యక్రమం



బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధి : ఇంటర్నేషనల్ యోగ వారోత్సవాల్లో భాగంగా శేషు, ఎమ్మెస్ సాఫ్టేర్ నందు విద్యార్థులతో యోగా అవగాహన కార్యక్రమం జరిగినది జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అందరూ ఘనంగా జరుపుకోవడానికి సన్నద్ధం కావలసిందిగా బాపట్ల ఎమ్మెస్ సాఫ్ట్వేర్ తరపు అందరిని కోరుకుంటున్నాము

## పాఠశాల విద్యను నాశనం చేసే 117 జీఓను వెంటనే రద్దు చేయాలని పిడిఎస్‌యు ధర్నా




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : వేలాది పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చే, విద్యా రంగాన్ని నాశనం చేసే 117 జీఓను వెంటనే రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, సమాంతరంగా తెలుగు, ఇంగ్లీష్, మైనర్ మాధ్యమాలను కొనసాగించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ ఇపి) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్ లో ధర్నా చేయడం జరిగింది. "జగన్ ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను ఖండించండి", "ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం" ,"3,4,5 తరగతులను హైస్కూల్స్ లో విలీనం చేయొద్దు", "పాఠశాలలను ముక్కలు చేయొద్దు" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్ యు జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తుందని విమర్శించారు. నాడు నేడు పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేసి పాఠశాలలకు రంగులేసి నేడు అవే పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేశారనీ అన్నారు.పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యూ గనిరాజు, ఎల్. రాజశేఖర్ మాట్లాడుతూ టీచర్ల రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన 117 జీవో పాఠశాల విద్యా రంగాన్ని నాశనం చేస్తుందని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు ఉపాధ్యాయ,విద్యార్థుల నిష్పత్తి 1:20 గా ఉంటే నేడు 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ గా చేసి వేలాది పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారబోతున్నాయని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, టీచర్ల కొరత కారణంగానే మొన్న 10వ తరగతి ఫలితాలు అధ్వాన్నంగా వచ్చాయని, 2లక్షల మంది ఫెయిల్ అయ్యారని అన్నారు. వీటి నుండి గుణపాఠాలు తీసుకోకుండా విద్యా రంగాన్ని భ్రష్టుపట్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. తక్షణమే 117 జీఓను రద్దు చేయాలని, లేకుంటే విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు విజయవాడ నగర కార్యదర్శి సాహిత్, నాయకులు వేణు,పావని తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుల సమావేశాలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్14: గుడివాడ పట్టణం రాజేంద్రనగర్ లోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమంపై నాయకులు చర్చించారు. అనంతరం జేఏసీ నాయకులు పొంగులేటి జయరాజు మీడియాతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా పేరును, అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబేద్కర్ వాదుల ఆత్మగౌరవ నీలి కవాతు పేరుతో నిర్వహించే ర్యాలీలో రాష్ట్ర నలుమూలల కు చెందిన అంబేద్కర్ వాదులు పాల్గొంటారని జేఏసీ నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత గా జేఏసీ నాయకులు పంతగాని సురేష్, గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్14:దినోత్సవాన్ని పురస్కరించుకొని గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో హాస్పటల్ ప్రాంగణంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. డి బి ఎస్ ఎల్ జనసేన ఆర్కే యూత్ కు చెందిన 23మంది సభ్యులు రక్తదాన శిబిరంలో , రక్తదానం చేశారు. రక్త దానం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, మనం చేసే రక్త దానం వల్ల నిండు ప్రాణం నిలబడేందుకు దోహదపడుతుందని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇందిరా దేవి అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైనవారికి రక్తదానం చేస్తూ , జనసేన ఆర్కే యూత్ సభ్యులు చేసిన కార్యక్రమాలు ఆదర్శనీయమని ఇందిరాదేవి కొనియాడారు. మానవ సేవే మాధవ సేవ అన్న సిద్ధాంతంతో, భగవంతుడు తనకిచ్చిన శక్తిమేరకు, మిత్రుల సహాయంతో అత్యవసర పరిస్థితుల్లో అవసరమైనవారికి తమ ట్రస్టు ద్వారా రక్తం అందించగలుగుతున్నామని డి బి ఎల్ ఎస్ ట్రస్ట్ కన్వీనర్ షేక్ కాజా అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆర్ కె, ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, ఏరియా హాస్పిటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వం.. పురందేశ్వరి రెండు వేరు కాదు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 14: గుడివాడ బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మట్టా ప్రసాద్ మాట్లాడారు.బీజేపీ ప్రభుత్వం పురందేశ్వరి రెండు వేరు కాదని, ప్రభుత్వ అభివృద్ధిని ఆమె అడ్డుకోరని ఆయన స్పష్టం చేశారు.రాజకీయ లబ్ధి కోసం అనవసర వివాదాల్లోకి పురందేశ్వరిని లాగితే సహించేది లేదని , గుడివాడలో బిజెపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఆమె అడ్డుకునే ప్రసక్తి లేదని మట్టా ప్రసాద్ అన్నారు. 2020 వ సంవత్సరంలో పురందేశ్వరి ద్వారా గుడివాడ రైల్వే ఫ్లైఓవర్ల సమస్యను తాము కేంద్ర మంత్రి గట్కరి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో గుడివాడలో నిర్మాణం కానున్న రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణానికి తాము అడ్డుకాదని, నిర్మాణాలు జరగాలని తాము కూడా కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు జిల్లాల బీజేపీ ఇంచార్జ్ హోదాలో నిత్యం పురందేశ్వరిని వందలమంది కలుస్తారని తన వద్దకు వచ్చిన వారి గ్రీవెన్స్ ను పరిశీలించాలని మాత్రమే కేంద్ర మంత్రికి లేఖ రాశారని మట్టా ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు అంగడాల సతీష్, బిజెపి నాయకులు సురె లక్ష్మీనారాయణ గాంధీ, సొంటి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



భీమవరం, జూన్14 (ప్రజాపాలన ప్రతినిధి) :సచివాలయ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలని జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి అన్నారు. మంగళవారం ఆయన భీమవరం పట్టణ పరిధిలోని 1,2,3,38,39 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార నివేదికలను పరిశీలించారు. ఈ నెలలో ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అని పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేసే సంబంధిత పథకాల అర్హుల జాబితాను ప్రతినెల సచివాలయంలో ప్రదర్శించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అన్నిరకాల సేవలను ఇంటివద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమని సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. సచివాలయంలో ఆలస్యం లేకుండా ప్రజలకు పౌర సేవలు అందాలని అవి కూడా ప్రజలు సంతృప్తిచెందే విధంగా నిర్దిష్ట సమయంలో అందించడం ద్వారా సచివాలయ వ్యవస్థకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఏ ఒక్క పౌర సేవలు నిర్దేశించిన కాలం దాటరాదని పౌరసేవలు అందించడంలో ప్రజలకు సంతృప్తికరంగా ఉండేలా చూడాలని సచివాలయంలో అన్ని రకాల ప్రభుత్వ పథకాల పోస్టర్లు ఖచ్చితంగా ప్రదర్శించేలా చూడాలని అన్నారు. సచివాలయంలోని అర్జీలు, రిజిస్టర్లను పరిశీలించి రిజెక్ట్ చేసిన అర్జీల వివరాలను జాయింటు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సహాయ పురపాలక సంఘం కమీషనర్ బి.జ్యోతిలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోన రఘుపతి



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి: బాపట్ల పట్టణంలో నీ 17వ వార్డులో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో గౌరవ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఇంటింటికీ తిరుగుతు సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించే కార్యక్రమం లో పాల్గొన్న నల్లమోతు వారి పాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు .

## సముద్రతీరంలో తెనాలికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతు..



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి: సూర్యలంక మెరైన్ సీ.ఐ సుబ్బారావు వారిని గమనించి బోటు ద్వారా ముగ్గురిని ఒడ్డుకు తీసుకువచ్చారు, ఒడ్డుకు వచ్చినవారు. మందలపు నాగేశ్వరరావు 22సం", నక్క ప్రసాద్ 23సం" వీరిద్దరి పరిస్థితి బాగుందని. లితెనాలికి చెందిన, ఏడుకొండలు 21 సం" అతనికి ప్రథమ చికిత్స అందించిన మెరైన్ పోలీసులు అతని పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకొని బాపట్ల ఏరియా హాస్పిటల్ కు తరలించారు..అక్కడ ఉన్న పర్యాటకులు మెరైన్ పోలీసులను అభినందించారు.

# ఏరువాక పూర్ణిమ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : రైతులంతా అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా అన్నదాతల్లో స్ఫూర్తి నింపేందుకే ఏరువాక పూర్ణిమ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కుందావారి కండ్రిక గ్రామంలో ఏరువాక పూర్ణిమ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వయంగా ట్రాక్టర్ తో పొలాన్ని దున్ని, విత్తనాలు చల్లారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రైతు భరోసా కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఈ సందర్భంగా




మల్లాది విష్ణు అన్నారు. అన్నదాతల విషయంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కన్న కలలను సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాకారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రైతులపై పైసా కూడా ఆర్థిక భారం పడనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. 2021 ఖరీఫ్ పంట నష్టపోయిన 15.61 లక్షల మంది రైతన్నలకు చెప్పిన మాట ప్రకారం రూ. 2,977.82 కోట్ల బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాలలో జమ చేయడం హర్షణీయమన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం రైతులను నిండా దగా చేసిందని.. రుణమాఫీ సహా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వంచించిందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. కానీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుల ముంగిటకే వ్యవసాయ పథకాలను తీసుకువచ్చిందని వెల్లడించారు. అంతేకాకుండా గత తెలుగుదేశం హయాంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు బకాయిలు పెట్టిన రూ. 990 కోట్లను ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే చెల్లించడం జరిగిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకం, రాయితీ విత్తనాలు, పురుగుమందులు, యాంత్రీకీకరణ పరికరాలు వంటి సంక్షేమ పథకాలతో జగనన్న ప్రభుత్వం రైతులను ఆదుకుంటోందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ముందు జాగ్రత్త చర్యలతో సాగునీటి ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నట్లు వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి రైతన్నలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, కండ్రిక సొసైటీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, పాలకేంద్రం ప్రెసిడెంట్ మంగారెడ్డి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, మేడా రమేష్, షేక్ ఇస్మాయిల్, మహేష్, సంజీవ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రైతులు సాదం శ్రీను, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొల్లి నాగిరెడ్డి, పామర్తి వెంకయ్య, చిన్ని, రామిరెడ్డి, వెంకటరెడ్డి, భీమిరెడ్డి శివరామిరెడ్డి, గోపిరాజు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో రెక్కలు విరిగిన ఫ్యాన్..?

తిరుపతి, జూన్ 14, :చిత్తూరులో అధికార పార్టీ కేడర్? ద్వితీయ శ్రేణి నాయకులు మెత్త పడ్డారా..? మునుపటి జోష్ లేకపోవడానికి కారణం ఏంటి? ఏదైనా కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం ఆలస్యం? ఓ రేంజ్‌లో హడావిడి చేసే నాయకులు ఇప్పుడు ఏమైపోయారు? ప్రస్తుతం ఆజిల్లాలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఏ పార్టీకి అయినా కేడర్‌లకే బలం. ఇక నాయకుడు ఎక్కడ ఉంటే కార్యకర్తలు ఆయన వెంట తిరుగుతుంటారు. ఎక్కడైనా జరిగేది అదే..! కానీ చిత్తూరు జిల్లాలో మాత్రం సీన్ రివర్స్‌లో ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గతంలో ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా జాతరను తలపించేలా ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు వాలిపోయేవారు. కానీ ఇప్పుడు జిల్లాలోని అధికారపార్టీలో అలాంటి వారు కనిపించడం లేదు. దివంగత నేత జయంతి, వర్ధంతి, సీఎం జన్మదినం, పార్టీ అవిర్భావ దినోత్సవాలు .. ఇలా అనేక కార్యక్రమాల్లో హడవుడి చేసే వైసీపీ శ్రేణులు ఇప్పుడు మౌనంగా ఉండిపోతున్నాయట..మొదటి నుంచి జెండా భుజానికెత్తుకొని పరుగులు పెట్టిన నేతలను కాదని? కొత్తగా పార్టీలో చేరిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టారని కొద్దిమంది గుర్రుగా ఉన్నారరు. మరోవైపు పదవులు పొందిన నాయకులు కూడా అలంకార ప్రాయాని తప్ప అధికారం లేని పదవులు ఎందుకని మదనపడిపోతున్నారట. ఇక చిన్నచిన్న పనులు కావడం లేదని, అత్యవసరం అని ఫోన్ చేసినా పట్టించుకోకుండా ఉన్నారని కార్యకర్తలు తెగ ఆవేదన చెందుతున్నారట, జిల్లాలో మొత్తం పరిస్థితి ఇలానే ఉన్నా నగరి, జిడి నెల్లూరు, సత్యవేడు, చిత్తూరు, తిరుపతి, పలమనేరు, పీలేరు,చంద్రగిరిలో దాని పాళ్లు మరింత ఎక్కువగా ఉందనేది టాయ్.రెండున్నరేళ్ల కాలంలో సగం కరోనాకు పోతే? ఇప్పుడు పరిస్థితులు మెరుగైనా? పార్టీలో తమ పరిస్థితులు బాగాలేవని కొందరు సన్నిహితుల వద్ద కడుపు చించుకున్నట్టు సమాచారం. చాలామంది ద్వితీయ శ్రేణి నేతలకు పదవులు దక్కలేదని గుర్రుగా ఉంటే? కార్యకర్తలైతే ఇటు నేతల వద్ద తమకు విలువే లేకుండా పోయిందని, ఆవేదన చెందుతున్నారట.ఏ చిన్న కార్యక్రమం జరిగినా నేతల చుట్టూ ఉండే కేడర్? ఇప్పుడు లీడర్ల మీద కోపంతో దూరం దూరం అన్నట్టు ఉంటున్నారన్నది ప్రధానంగా వినిపిస్తున్న టాక్. ఇటీవల నగరి, జీడీ నెల్లూరులో మంత్రి రోజా, నారాయణ స్వామిల పర్యటనలో కేడర్ తక్కువ, అధికారులు ఎక్కువగా కనిపించారని చెప్పుకుంటున్నారు. ఇటు తిరుపతిలో గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన వెంట? కార్పొరేటర్లు, మేయర్లు, అధికారులు తప్ప ఎవరు లేరని చెప్పుకుంటున్నారు. చిత్తూరులో కేడర్ మొత్తం ఎమ్మెల్యేతో కాకుండా మరోనేత విజయనందారెడ్డి వెంట వెళుతున్నారట. సత్యవేడులోనూ సేమ్ సీన్. ఇలా చెప్పుకుంటే ప్రతినియోజకవర్గంలో కేడర్ నేతలకు షాక్ ఇస్తూ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారట. వచ్చిన కొద్దిమంది కూడా ఇలా కనిపించి ఓ నమస్కారం పెట్టి వెళ్లిపోతున్నారట. మరి ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు పార్టీ ఏం చేస్తుందన్నది చూడాలి.

# చేనేతల.. ఎదురు చూపులు

అనంతపురం, జూన్ 14, :కరోనా వల్ల చితికిపోయిన నేతన్నలు ఇప్పుడిప్పుడే కోలుకుంటూ తిరిగి పనుల్లో కుదురుకుంటున్నారు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా? వీరికి విద్యుత్ ఛార్జీలు పెంపు గుదిబండగా మారాయి. పరిస్థితి ఇలానే ఉంటే రైతుల్లానే మేము కూడా ఆత్మహత్య చేసుకోవాలంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు నేత కార్మికులు. పరిశ్రమల కేటగిరీలోకి మార్చి అదనపు బిల్లులు వసూలు చేస్తుండటంతో.. నేత కార్మికుల విద్యుత్ ఛార్జీలు రెండు రెట్లు పెరిగాయి. ఈడీ ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో నష్టపోతున్నామని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవర్ లూమ్ కార్మికులను కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. అధిక ఛార్జీలు వారిని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఇక్కడి విద్యుత్ అధికారులు వీరిపై ఎడాపెడా ఛార్జీలు వేస్తున్నారు. పనులు చేయలేక ఎక్కువ మంది కార్మికులు వృత్తులు వదిలేసి వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారు నియోజకవర్గ పరిధిలో మరమగ్గాలపై ఆధారపడి జీవిస్తున్న నేత కార్మికుల కుటుంబాలపై విద్యుత్ ఛార్జీల పెంపు తీవ్ర ప్రభావం చూపుతోంది. నగరి నియోజకవర్గంతో పాటు నారాయణవనం మండలాల్లో దాదాపు 16 వేల కుటుంబాలు మరమగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గత రెండేళ్లుగా కరోనా వల్ల వ్యాపారం లేక నష్టపోయారు. సాధారణ పరిస్థితులు నెలకొని.. వ్యాపారాలు పుంజుకొంటున్న సమయంలో కరెంటు ఛార్జీలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయని నేతన్నలు వాపోతున్నారు. మరమగ్గాలపై కుటుంబం మొత్తం నెల రోజుల పాటు కష్టపడితే 10వేల రూపాయలు ఆదాయం వస్తుందని.. దానిలో 3, 4వేల రూపాయలు విద్యుత్ ఛార్జీలకే చెల్లించాల్సి వస్తోందని నేత కార్మికులు వాపోతున్నారు. అధికారంలోకి వస్తే 500 యూనిట్ల వరకు ఉచితంగా మరమగ్గాలకు విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీ అమలు చేయడం మాట అటుంచి ఛార్జీలు పెంచారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమగ్గాలకు విద్యుత్‌పై గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీ సైతం తొలగించారని వాపోతున్నారు. ఈడీ ఛార్జీల పేరుతో తమ కడుపు కొడుతున్నారని వాపోతున్నారు. మరమగ్గాలపై యూనిట్ కు 94 పైసలు పెంచడంతో గతంతో పోలిస్తే రెట్టింపు కరెంటు బిల్లులు వస్తున్నాయని నేత కార్మికులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. ఇక ఇతర రాష్ట్రాల్లో పవర్ లూమ్ కార్మికులకు ఆయా ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి. తమిళనాడులో 50 శాతం ఉచితంగా అక్కడి ప్రభుత్వం ఇస్తోంది. అలాగే సిరిసిల్ల ప్రాంతంలో పవర్ లూం రాయితీలిస్తోంది. కేరళలో కూడా పవర్ లూమ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటోంది. అయితే మన రాష్ట్రంలోనే ఈ విధంగా కార్మికులపై వివిధ రకాల భారాలు మోపుతురని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మకూరులో మెజార్టీపై గురి

నెల్లూరు, జూన్ 14, :నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో అధికార వైసీపీ- బీజేపీల నేతలు రకరకాల ఫీట్లు చేస్తున్నారు. ఉప ఎన్నిక కోసం సీఎం జగన్ పలువురు రాష్ట్ర మంత్రులను గుంపులు గుంపులుగా ఆత్మకూరుకు దించేశారు. బీజేపీ కూడా తానేమీ తక్కువ కాదని వారానికి మూడుసార్లు సోము వీర్రాజును ప్రచారానికి పంపుతోంది. ఈ రెండు పార్టీల హడావుడి చూసిన జనం ముక్కున వేలేసుకుంటున్నారు. మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆకస్మిక మరణం తరువాత ఆత్మకూరు నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. మేకపాటి కుటుంబం నుంచి వైసీపీ అభ్యర్థిగా గౌతమ్ రెడ్డి సోదరుడు విక్రమ్ రెడ్డి బరిలో దిగారు. ఈ ఉప ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ పోటీలో లేకపోయినా.. అధికార వైసీపీ తన బలాన్ని ప్రదర్శించుకునేందుకు మండలానికి ఇద్దరు మంత్రులను ఇన్ ఛార్జ్ లుగా నియమించింది. అంతేకాదు నెల్లూరు జిల్లాలోని ఒకరిద్దరు నేతలు తప్పిస్తే మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలంతా ఆత్మకూరులోనే మకాం వేసి, గుంపులు, గుంపులుగా తిరుగుతున్నారు. మంత్రుల హడావుడి చూసి ప్రతిపక్షాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. సామాన్య ప్రజలు మాత్రం 'ఇదేందబ్బా సరైన పోటీ లేకపోయినా.. ఇంత హడావుడి చేస్తున్నారు?' అంటూ నొసలు చిట్లిస్తున్నారు. లక్ష ఓట్ల మెజారిటీతో వైసీపీ గెలుస్తుందంటూ ఆత్మకూరు వచ్చిన మంత్రులు పొలికేకలు పెడుతుండడం గమనార్హం. అసలు పోటీలోనే లేని టీడీపీపై వారు సవాళ్లు విసురుతుండడం విచిత్రంగా ఉందంటున్నారు జనం. అయినా ఉప ఎన్నికల్లో ఎలాగూ మరణించిన సిటింగ్ ఎమ్మెల్యే కుటుంబంపై సింపతి ఉంటుంది. పైగా అధికార పార్టీకే గెలుపు అవకాశాలు ఎక్కువ ఉంటాయి. అయినప్పటికీ మంత్రులు ఇలా పొలికేకలు పెట్టడం ఏంటనే ప్రశ్నలు సర్వత్రా వస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే.. అధికార పార్టీది బలుపు కాదు వాపు అని స్థానిక జనం వ్యాఖ్యానిస్తున్నారు. ఒక పక్కన వైసీపీ బ్యాచ్ చేస్తున్న వింతలతోనే విసిగెత్తిపోతున్న జనం భారతీయ జనతా పార్టీ నేతలు చేస్తున్న హడావుడిని చూసి మరింతగా అసహనం వ్యక్తం చేస్తున్నారు .ఆత్మకూరు నియోజకవర్గంలో బీజేపీ తరపున పోటీ చేసే దిక్కు




లేదు. ఎక్కడి నుంచో అభ్యర్దిని తీసుకొచ్చి నామ్ కె వాస్తే పోటీ పెట్టింది. అయినా సరే.. బీజేపీ సత్తా చాటుతామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆత్మకూరు వీధుల్లో కోతలు కోస్తుంటే పొట్ట చెక్కలయ్యేలా పగలబడి నవ్వుకుంటున్నారు జనం. 'మింగ మెతుకు లేకపోయినా.. మీసాలకు సంపంగి నూనె' అన్నట్టు.. వీర్రాజు వీరంగం భలే గమ్మత్తుగా ఉందంటున్నారు ఆత్మకూరు నియోజకవర్గం ప్రజలు. బీజేపీ చేస్తున్న డూపు ప్రచారంపై తెగ సెటైర్లు కూడా వేస్తున్నారు మెట్ట ప్రాంత ప్రజలు.ఎవరిపై ఎవరు లక్ష ఓట్ల మెజారిటీ సాధిస్తారు? ఎవరిపై ఎవరు సత్తా చాటుతారో.. అర్థం కాక తల పట్టుకొని మరీ విశ్లేషకులు లెక్కలు వేసుకుంటుండడం కొస మెరుపు.

## వై. ఎస్. అర్, జనసేన పార్టీల నుండి తెలుగుదేశం పార్టీ లోకి పార్టీపెద్దఎత్తున చేరికలు



రావులపాలెం (ప్రజాపాలన ప్రతినిధి):కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో వైఎస్ఆర్సిపి జనసేన పార్టీల కు రాజీనామా చేసిరావులపాలెం మరిరావులపాలెం కొత్తకాలనీ నుండి %ఖ ఖ% యూత్ వారు మరియు వారి ఆధ్వర్యంలో సుమారు 70 మంది %ూ=జూ% పార్టీ మరియు జనసేన పార్టీల నుండి తెలుగుదేశం పార్టీ లోనికి పార్టీపెద్దఎత్తున చేరికలు.ఈచేతకాని, అసమర్థ, దద్దమ్మ %జూ% ప్రభుత్వంపై చేస్తున్న అలుపెరుగని పోరాటానికి మరియు కొత్తపేట నియోజకవర్గంలో బండారు సత్యానందరావు నాయకత్వంపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి ఆకర్షితులై బండారు సమక్షంలో రావులపాలెం కాపు కళ్యాణమండపం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ లోనికి చేరడం జరిగింది.వీరందరికీ బండారు పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బండారు మాట్లాడుతూ రానున్నది మన తెలుగుదేశం ప్రభుత్వమేనని అపుడు యువతకు పెద్దపీట వేస్తామని, ఎలాంటి అవకాశాలైనా ముందు యువతకు కల్పిస్తామని, యువనాయకుడు లోకేష్ బాబు యువత తరుపున ముందుకు వస్తున్నారని ఇకపై తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో స్టైల్ మార్చబోతోందని అలాగే కొత్తపేట నియోజకవర్గంలో సత్యానందరావు కూడా స్టైల్ మార్చబోతున్నారని యువతకు భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు టిడిపి నాయకులు కార్యకర్తలు తెలుగు యువత పాల్గొన్నారు

## 16 కె.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

### త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



గోకవరం : ప్రజాపాలన ప్రతినిధి: తూర్పు గోదావరి జిల్లా జూన్ 14 గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో 16 కె.వి త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ తాగునీటి సరఫరాకు సంబంధించి ఇటీవల సమస్యలు తలెత్తడంతో పాడైన ట్రాన్స్ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఏపీ ఈపీడీసీఎల్ అధికారుల సహకారంతో గ్రామ సర్పంచ్ బత్తుల వెంకట రామకృష్ణ (శ్రీను) సూచనల మేరకు స్థానిక లైన్మెన్ చొరవతో ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. అచ్యుతాపురం గ్రామంలో గ్రామ పంచాయితీ విద్యుత్ బోరు వద్ద దీన్ని అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ శ్రీను సమక్షంలో ఏపీ ఈపీడీసీఎల్ ఉద్యోగి వెంకటేష్, స్థానిక సిబ్బంది గంగరాజు తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, జూన్ 14, ప్రజాపాలన : : రైతుల సంక్షేమం, రైతాంగ శ్రేయస్సే లక్ష్యంగా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. పంట నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ నగదును రైతుల ఖాతాల్లో వేసే లైవ్ ప్రోగ్రాం ప్రతి రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయగా, కావూరి వారి పాలెం ఆర్ బి కె లో చైర్మన్ రమణారెడ్డి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి జగన్ మాదిరిగానే, రైతు బిడ్డ అయిన చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆయన తనయుడు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు లు కూడా, చీరాల ప్రాంత రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు.తమ తమ ఖాతాల్లో నగదు వేసినందుకు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి, రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఆర్ బి కే వ్యవసాయ అధికారిణి ఎమేలియా, ఆర్ బి కే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ బ్రిడ్జి ని ప్రారంభించిన ఆమంచి సుపుత్రులు



వేటపాలెం, జూన్ 14, ప్రజాపాలన : : మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ చెరువుల వద్ద, కుందేరు పై ఫుట్ బ్రిడ్జి నిర్మించారు.ఈ ఫుట్ బ్రిడ్జి ని కుటుంబ సమేతముగా, ఆమంచి కుమారుల చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు.తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాల నియోజకవర్గ ప్రజలు, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, మాజీ ఎమ్మెల్యే ఆమంచి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడేళ్లలో 1100 కోట్ల విరాళాలు



తిరుమల, జూన్ 14, : అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవారు ప్రపంచంలోనే అత్యంత ధనికమైన దేవుడు. భక్తుల నుంచి కానుకలు, విరాళాల రూపంలో శ్రీవారికి వందల కోట్లు చేరుతున్నాయి. రెండేళ్ళుగా కరోనా కారణంగా శ్రీవారి హుండీ ఆదాయం ఆశించిన మేరకు రాలేదు. దాతల సహకారం మాత్రం టీటీడీకి భారీగానే లభించింది. కోవిడ్ సమయంలోనూ టీటీడీ కార్యక్రమాలకు రూ.వందల కోట్ల విరాళాలు లభించాయి. టీటీడీ పథకాలకు 2019లో రూ.308 కోట్ల విరాళాలు వచ్చాయి. 2020లో రూ.232 కోట్లు, 2021లో రూ.564 కోట్ల విరాళాలు టీటీడీ ఖజానాకు చేరాయి.పథకాల వారీగా గమనిస్తే.. గత మూడేళ్లలో అన్నప్రసాదం పథకానికి రూ.390 కోట్లను భక్తులు విరాళంగా సమర్పించారు. అటు ప్రాణదాన పథకానికి రూ.160 కోట్లు, గోసంరక్షణ పథకానికి రూ.62 కోట్లు, బర్డ్ ట్రస్ట్ పథకానికి రూ.41 కోట్లు వచ్చి చేరాయి. వెంకటేశ్వర సర్వ శ్రేయా ట్రస్టుకు రూ.29 కోట్లు, విద్యాదానం ట్రస్టుకు రూ.36 కోట్లు, వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.26 కోట్లు, శంకర నేత్రాలయ ట్రస్టుకు రూ.5 కోట్లు, శ్రీవాణి ట్రస్టుకు రూ.350 కోట్లను భక్తులు విరాళంగా అందించారు. కోవిడ్ సమయంలో హుండీ ఆదాయం పడిపోయినా టీటీడీ ట్రస్టుల పథకాలకు రూ.1100 కోట్ల మేర భక్తులు టీటీడీకి విరాళంగా సమర్పించారు.తాజాగా తిరుమల శ్రీవారికి మరోసారి భారీ విరాళాలు అందాయి. ఆదివారం నాడు టీటీడీలోని ట్రస్టులకు వివిధ సంస్థల నుండి రూ.3.20 కోట్లు విరాళంగా అందింది. హైదరాబాద్ ఆర్ఎస్ బ్రదర్స్ గ్రూప్స్ సంస్థ యాజమాన్యం వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, రాజమౌళి ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్టుకు రూ.1.20 కోట్లు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.60 లక్షలను విరాళంగా అందించారు.

# ఆ ముగ్గురు ఎంపీలకు మార్పు తప్పదా..?

గుంటూరు, జూన్ 14,:నలుగురితో ఎప్పుడూ బాగుండాలి, అందరినీ సమానంగా చూడాలి, మంచివాళ్లని అనిపించుకోవాలి. మంచిగా ప్రవర్తించాలి.. ఇవి అనాదిగా పెద్దవాళ్లు చెబుతున్న సూక్తులు. విని వాటి సారాంశం ఆకళింపు చేసుకోవాలి. లేకుంటే అప్రతిష్ట పాలవడం ఖాయం. ఇపుడు జగన్ సర్కార్‌ది ఇదే పరిస్థితి. కొన్ని విషయాలు పరిశీలించి పట్టించుకోవాలి. ఈ రెండూ నిర్లక్ష్యం చేసి సమస్యలు కొని తెచ్చుకున్న నేత వైసీపి అధినేత జగన్ రెడ్డి. అధికారంలోకి రావాలని తాపత్రయపడి, తీరా వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే పార్టీ వర్గాల్లో సమస్యలు తలెత్తకా పోవు, క్రమేపీ మంత్రులు, ఎమ్మెల్యేలకూ ప్రాణం విసిగెత్తకా పోదు. మరి అదే జరిగింది. మూడేళ్ల పాలన తర్వాత తరచి చూసుకుంటే పార్టీ వర్గాల్లో సఖ్యతా లోపం, నాయకుని మాటకే విలువ లేకపోవడం, జంపింగ్ జిలానీలుగా మారడానికి ఏమాత్రం వెనుకాడకపోవడం. అన్నీ జరిగిపోతున్నాయి.ఏపీలో ముగ్గురు ఎంపీలు వైసీపిలో ఏమాత్రం కొనసాగేందుకు ఆసక్తి చూపడం లేదన్నది తేట తెల్లమయింది. వారి వారి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో నిత్యం చిన్నపిల్లల్లా గొడవలు పడుతున్నారు. వారి మధ్య ఏమాత్రం స్నేహపూర్వక వాతావరణం లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితుల్లో వైసీపీ నిలదొక్కుకునే స్థాయి క్రమేపీ కోల్పోతోంది. మూడేళ్లలో ఎన్నికలు జరగనుండగా పార్టీలోని సీనియర్లలోనూ ప్రశాంతత కరువయింది. దీనికి తోడు వచ్చే ఎన్నికలకు పొత్తులకు అవకాశం వుందని తెలుగు దేశం అనడంతో వైసీపీ ఎంపీలు కొంత ఆకర్షితులయ్యారనే చెప్పాలి.ఉత్తరాంధ్రలో నరసాపురం నియోజకవర్గం తీసుకుందాం. ఇక్కడ జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు కనిపించరు. ఇప్పుడు కాదు రెండేళ్లుగా అసలు నియోజకవర్గానికే ఆయన దూరంగా వున్నారు. అంతేకాదు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు మద్దతునిస్తుండటం గమనార్హం. ఆయనకు పార్టీ నాయకునికి మధ్య విభేదాలు ఆఖరికి ఆయన తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటారేమో నన్న అనుమానాలకి దారితీస్తోంది. రెబెల్ స్టార్‌గా రాజకీయాల్లో ప్రసిద్ధి పొందడంతో ఆయన్ను పార్టీ నుంచి తొలగించాలనుకున్నారు జగన్. కానీ ఆయనపై అనర్హత వేటు వేయడానికి సాంకేతిక ఇబ్బందులు అడ్డు పడ్డాయి. పార్టీలో వున్నట్టేనా అంటే వున్నట్టే, మీవాడేగా అంటే మావాడే కాని కాదు.. అనే రీతిలో రెండేళ్లుగా వైసీపీలో రఘురామరాజు ప్రయాణం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టిడిపీ టికెట్ మీదనే తన నరసాపురం నియోజకవర్గం నుంచే పోటీచేసినా పెద్దగా ఆశ్చర్యపడనక్కర్లేదు. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు వారి ఎంపీ లావు కృష్ణదేవరాయలను బొత్తిగా పట్టించుకోవడం లేదు. పాపం ఆయన మాత్రం అందరితో కలిసి పనిచేయాలన్న మనసున్న వ్యక్తే. ఎమ్మెల్యేలే ఆయన్ను దూరంగా పెట్టేరు. మరీ ముఖ్యంగా విడదల రజని(చిలకలూరిపేట), బొల్లా బ్రహ్మనాయుడు (వినుకొండ)తో ఆయనకు తరచూ ఏదో విధంగా వివాదాలు తలెత్తుతున్నాయి. ఇతర ఎమ్మెల్యేలు కూడా అంటీ అంటనట్టే వ్యవహరిస్తున్నారు. అంతెందుకు ఇటీవల బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రులు నిర్వహించిన సామాజిక న్యాయభేరి బస్సు యాత్రకు, నరసరావు పేటలో జరిగిన బహిరంగ సభకు ఎంపీ లావు దూరంగానే వున్నారు. పార్టీ అధిష్టానానికి ఎంత గోడు పెట్టుకున్నా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్టే అయింది. విసిగెత్తింది. మనసు విరిగింది. పార్టీ మారతారన్న ప్రచారం కూడా జోరందుకుంది. మారినా ఆశ్చర్యపడగనక్కర్లేదు.ఇక ఇటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి విషయానికి వస్తే, అసలు ఎంపీగా ఎన్నికయినప్పటి నుంచే ఆయన అసంతృప్తిగానే వున్నారు. ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదనే ఆయన వైసీపీలోకి వచ్చేరు. ఇక్కడ ఆయనకు లాభం కంటే నష్టమే జరిగిందన్న భావనతో కుంగిపోతున్నారు. దేశ వ్యాప్తంగా పేరున్న తమ మ్యాకడోవెల్స్ వైన్ అమ్మకాలకు అనుమతి ఇవ్వలేదని ప్రభుత్వం మీద కాస్తంత కినుక వహించేరు. పక్క రాష్ట్రాలు ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది పెట్టడం లేదన్న అభిప్రాయం నాటుకుంది. దీనికి తోడు స్థానికంగా బాలినేని ఆధిపత్యం చలాయించడం పెరిగింది. దీంతో తనకు అంతకు ముందున్న పట్టు పోయిందని ఇబ్బందిపడుతున్నట్టు అనుచరులే అంటున్నారు. ప్రోటోకాల్ సమస్య ఇంతగా ఇబ్బందిపెడుతుందా, ఏవె?గానీ మాగుంట మాత్రం వచ్చే ఎన్నికల సమయానికి పార్టీ మారే అవకాశాలే ఎక్కువగా వున్నాయని విశ్లేషకులు అంటున్నారు.మూడేళ్లకే డీలాపడ్డ జగన్‌ని వచ్చే ఎన్నికల నాటికి ఎవరు, ఎలా ధైర్యం ఇచ్చి నిలబెట్టగలరు స్వపార్టీవారే పక్క చూపులు చూస్తుంటే పార్టీ అధినేత చేసేదేముంటుంది. వచ్చే ఎన్నికల సమయానికి టిడిపి వంచన చేరేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందన్నది పరిశీలకుల మాట. అదెలా వున్నా, తాను వూహించనది జరిగి తీరాలన్న పట్టుదల, తన మాటే వినాలన్న మొండితనమే వైసీపీ కోటను బద్దలుకొట్టగలదు.

## కార్పొరేట్ స్కూళ్లలో రిజర్వేషన్లు



విజయవాడ, జూన్ 14, :పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను తప్పనిసరిగా కేటాయించేలా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. 2022 ? 23 విద్యాసంవత్సరం నుంచి దీన్ని పక్కాగా అమలు చేసేలా పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. తద్వారా వీటిల్లో ఏటా లక్ష సీట్లు పేద విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.విద్యాహక్కు చట్టం ప్రకారం పేద పిల్లలందరికీ కార్పొరేట్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేలా 'ఇండస్ యాక్షన్' అనే సంస్థతో పాఠశాల విద్యాశాఖ ఎంవోయూ కూడా కుదుర్చుకుంది. గవర్నెన్స్, టెక్నాలజీ సపోర్టు తదితర అంశాల్లో సంస్థ ప్రభుత్వానికి సహకారం అందించనుంది. ఈ సంస్థ ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఆర్టీఈ చట్టం అమలుకు తోడ్పాటునిచ్చి లక్షల మంది పేద విద్యార్థులకు మేలు చేకూర్చింది. దేశంలో 6 నుంచి 14 ఏళ్ల వయసు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యకోసం కేంద్ర ప్రభుత్వం 2009లో జాతీయ విద్యాహక్కు చట్టాన్ని తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టంలోని సెక్షన్ 12 (1సి) ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్, నాన్ మైనారిటీ, గుర్తింపు పొందిన ప్రతి పాఠశాల యాజమాన్యాలు నర్సరీ, ఎల్‌కేజీ, లేదా ఒకటో తరగతి నుంచి సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయించాలి.చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి దశాబ్దం దాటినా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2010లోనే ఆర్టీఈ చట్టాన్ని నోటిఫై చేసినా విధానపరమైన కారణాలతో పాటు కోర్టు స్టే ఉత్తర్వుల కారణంగా పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం కోటా అమలుకు నోచుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీఈ చట్టం అమలుపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు 25 శాతం కోటా ప్రకారం సీట్లు కేటాయించేలా చర్యలు చేపట్టారు. వరుసగా రెండేళ్లు కరోనా కారణంగా పాఠశాలలు మూతబడిన నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది.తాజాగా ఈ ఏడాది నుంచి కోటా అమలుకు సన్నద్ధమైంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని, త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు.అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించేందుకు 25 శాతం కోటా తోడ్పడనుంది. ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ స్కూళ్లలో విద్యను పేద విద్యార్థులు అందుకోలేకపోతున్నారు. ఆర్టీఈ చట్టాన్ని అమలు చేయడం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం కోటా కింద సీట్లను కేటాయించి ఫీజులను ప్రభుత్వమే యాజమాన్యాలకు చెల్లిస్తుంది.స్కూళ్లు, తరగతుల వారీగా చెల్లించాల్సిన ఫీజులపై పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే కమిటీని నియమించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా తరగతుల నిర్వహణకు అయ్యే వ్యయాన్ని అనుసరించి ప్రైవేట్ స్కూళ్లకు ఫీజులను చెల్లించనున్నారు.

# పొత్తులు.. ఎత్తులు..

కాకినాడ, జూన్ 14, :చంద్రబాబుకు పవన్ అవసరం. పవన్ కు టీడీపీ అవసరం. ఇద్దరూ కలవడానికి ముఖ్యమంత్రి పదవి అడ్డుగా మారింది. గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్ లో పొత్తులపై చర్చ జరుగుతుంది. జనసేన అధినేత జనం ముందు ఉంచిన మూడు ఆప్షన్లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. పవన్ తో పొత్తు లేకుంటే ఈసారి విజయం సాధ్యం కాదని చంద్రబాబుకు తెలియంది కాదు. గత ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత ఎన్నికల్లో.... 2019 ఎన్నికల్లో టీడీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. కానీ వచ్చింది 23 సీట్లు మాత్రమే. వచ్చిన ఓట్ల శాతానికి, దక్కిన సీట్లకు మధ్య పొంతనే లేదు. దాదాపు యాభై నుంచి అరవై సీట్లు తక్కువ మెజారిటీతో టీడీపీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అది జనసేన విడిగా పోటీ చేయడం వల్లనేనని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. జనసేన ఓట్లు చీల్చడం వల్లనే తమ అభ్యర్థులు ఓటమి పాలయ్యారని



చంద్రబాబు సయితం అంగీకరించాలంటున్నారు. అధికారంలోకి రావాలంటే తమ మద్దతు అవసరమని గుర్తించాలని లెక్కలతో వివరస్తుంది. పవన్ ను ముఖ్యమంత్రిగా చేస్తే పొత్తు పెట్టుకోవడానికి తమకు అభ్యంతరం లేదని జనసైన ముఖ్యనేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయినా జనసేనకు ఒరిగే నష్టమేమీ లేదు. 2029 నాటికి టీడీపీ స్థానంలో ప్రత్యామ్నాయ పార్టీగా తాము ఎదుగుతామని జనసేన భావిస్తుంది. టీడీపీ అంగీకరించకపోయినా బీజేపీతో కలిసి జనసేన పోటీ చేయాలని భావిస్తుంది. మరో వైపు వైసీపీని ఓడించాలంటే ఖచ్చితంగా జనసేనతో పొత్తు పెట్టుకోవాలని టీడీపీ నేతలు చెబుతున్నారు. కానీ కిందిస్థాయి క్యాడర్ ఇందుకు విముఖంగా ఉంది. ప్రజల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని బలమైన కోరిక ఉందని, క్షేత్రస్థాయిలో నాడి తమకు తెలుసునని, అందుకే ఒంటరిగా పోటీ చేయాలని సూచనలు అందుతున్నాయి. ద్వితీయ శ్రేణి నేతల నుంచి చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేయాలని అభ్యర్థనలు అందుతున్నాయి.. మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తే గెలిపించుకునే బాధ్యత తమదేనంటూ క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. పొత్తుల విషయంలో ఎన్నికలు చివర నాటికి తేలుద్దామని, ఇప్పుడే ఆలోచించ వద్దని చంద్రబాబు సూచించారట. 175 నియోజకవర్గాల్లో టీడీపీని బలోపేతం చేసే దిశగా తమ ప్రయత్నాలు ఉంటాయని, కార్యకర్తలు గ్రాస్ రూట్ లో ఏం జరుగుతుందో తెలుసునని సీనియర్ నేతల వద్ద చంద్రబాబు వ్యాఖ్యానించారట. అంటే చంద్రబాబు మనసులోనూ జనసేనతో బేరాలకు సంసిద్ధంగా లేరనే అర్థమవుతుంది. ప్రజలు కూడా తమ ఓటును దుర్వినియోగం చేసుకోరని, ఈసారి తెలుగుదేశం ఒంటరిగా మ్యాజిక్ ఫిగర్ ను దాటుతుందన్న నమ్మకం చంద్రబాబులో కనపడుతుంది. పవన్ కూడా తన వ్యూహంలో తాను ఉన్నారు. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

## వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి

**వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కరణంవెంకటేష్ బాబు**

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ కృషి**

**రామకృష్ణాపురంలో వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ పర్యటన**



చీరాల, జూన్ 14, ప్రజాపాలన : : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధి వైసిపి తోనే సాధ్యమని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు.చీరాల మండలం, రామకృష్ణా పురం పంచాయితీ సచివాలయం-2 పరిధిలో, గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమాన్ని, వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, అనంతరం గ్రామంలో లబ్ధిదారులను కలిశారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీఓ సాంబశివరావు, ఏపీఎం సుబ్బారావు, సెక్రటరీ బాపూజీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గోలి వెంకట సుబ్బారావు, కాటూరి దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, శివాలయం కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ మండా సత్యం, భాస్కరరావు, పందరబోయిన కృష్ణ, రమణ, హరిబాబు, బుజ్జప, దివి జయరామ్, ఆజాద్, బట్ట బాబురావు, మునిసిపాలిటీ వైస్ ఛైర్మన్ జైసన్ బాబు, దేవరపల్లి బాబురావు, మురళి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వల్లభనేని..వంగవీటి... మల్లాది.. సెంట్రల్ పై గురి

విజయవాడ, జూన్ 14, :రాజకీయాల్లో ఏది జరిగినా విచిత్రవే. వ్యక్తిగతంగా సన్నిహితులు, స్నేహితులు అయిన వారు విరుద్ధమైన పార్టీలో ఉన్నప్పటికీ వారి కలయిక ఎప్పటికప్పుడు చర్చకు దారితీస్తుంది. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో పార్టీల కతీతంగా రాజకీయ నేతలు తమ స్నేహాలు కొనసాగిస్తారు. అందులో వంగవీటి రాధా ఒకరు. ఆయనకు మాజీ మంత్రి కొడాలి నాని, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మంచి స్నేహితులు. వీరు ఏ పార్టీలో ఉన్నప్పటికీ తరచూ కలుస్తుంటారు. వంగవీటి రాధా, వల్లభనేని వంశీ గన్నవరం నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ లో కలిసారు. ఇద్దరు కలసి ఒకే కారులో వెళ్లి ఏకాంతంగా చర్చించారు. వల్లభనేని వంశీ టీడీపీ నుంచి బయటకు వచ్చి వైసీపీలో గ్రూపుల మధ్య ఇబ్బంది పడుతున్నారు. వంగవీటి రాధా









గత కొంతకాలంగా టీడీపీకి దూరంగా ఉంటున్నారు. మరి వీరిద్దరి కలయిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలోకి వల్లభనేనిని వంగవీటి ఆహ్వానించారా? లేక వైసీపీలోకి వంగవీటిని వల్లభనేని రావాలని కోరారా? అన్న చర్చ జరుగుతోంది. వల్లభనేని వంశీ ఇక టీడీపీకి వెళ్లే అవకాశాలు లేవు. ఎందుకంటే నారా చంద్రబాబు కుటుంబంపై వల్లభనేని వంశీ అన్న మాటలతో ఆ పార్టీకి పూర్తిగా దూరమయినట్లే, వంగవీటి రాధా విషయంలోనే కొంత చర్చ జరుగుతుంది. ఇటీవల మహానాడుకు కూడా వంగవీటి రాధా దూరంగా ఉన్నారు. జగన్ కూడా అభ్యర్థులను మార్చాలని భావిస్తున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి మల్లాది విష?ణును తప్పిస్తారన్న ప్రచారం జరుగుతుంది. గత ఎన్నికల్లోనే విష్ణు అతి కొద్ది ఓట్లతోనే విజయం సాధించారు. దీంతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టిక్కెట్ ను వంగవీటి రాధాకు ఇచ్చేలా కొడాలి నాని, వల్లభనేనివంశీ పార్టీ అధినాయకత్వాన్ని ఒప్పిస్తారన్న ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారం మధ్య వీరి కలయిక రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. కాపు సామాజికవర్గం ఓట్లకు దూరమవుతున్న వైసీపీకి వంగవీటి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా కొంత ప్లస్ అవుతుందని కూడా లెక్కలు వేస్తున్నారు. మరి వీరి మధ్య జరిగిన చర్చ ఏంటన్నది బయటకు తెలియలేదు. కానీ త్వరలోనే ఒక ప్రకటన వెలువడుతుందన్న టాక్ మాత్రం రాధా శిబిరం నుంచి వినపడుతుంది.



అంటే.. అన్ని

## సినిమాలను అలా చూడవద్దు ప్లీజ్



నేచురల్ స్టార్ నాని నజ్రియా నజీమ్ జంటగా నటించిన చిత్రం అంటే సుందరానికి భారీ అంచనాల మధ్య రిలీజై మిశ్రమ ఫలితాలు అందుకుంటోంది. నాని ఫ్యాన్స్ను ఈ సినిమా నిరాశపరిచినట్లే కనిపిస్తోందని సినీ విశ్లేషకులు అంటున్నారు. నాని యాక్టింగ్కి ఎదురు లేకపోయినా.. సినిమాలో ల్యాగ్ ఎక్కువగా ఉందని.. కొన్ని సీన్లను కత్తిరిస్తే బాగుండేదని అభిప్రాయం వెలువడుతోంది. ఈ నేపథ్యంలో అంటే సుందరానికి టీం సక్సెస్ మీట్ పెట్టడం చర్చనీయాంశమైంది. సినిమా ఫ్లాప్ అయినా సక్సెస్ మీట్లు ఏంట్రా బాబు అంటోన్న కొందరికి నాని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జూన్ 10న విడుదలైన అంటే సుందరానికి సినిమా సక్సెస్ మీట్ను హైదరాబాద్లో నిర్వహించారు. నేచురల్ స్టార్ నాని నజ్రియా జంటగా.. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో భారీ అంచనాలతో విడుదలైన ఈ సినిమా మిశ్రమ ఫలితాలను అందుకుని అభిమానులను నిరాశపరిచింది. అయినా.. ఈ సినిమాకు సక్సెస్ మీట్ పెట్టడం టాలీవుడ్లో చర్చనీయాంశమైంది. మరోవైపు ఫ్యాన్స్ కూడా ఫ్లాప్ సినిమా కు సెలబ్రేషన్స్ ఏంటని విస్తుపోతున్నారు. ఈ క్రమంలో సక్సెస్ మీట్లో హీరో నాని కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అంటే సుందరానికి టీమ్ అందరికీ థాంక్స్. అందరం కలిసి ఇంత బ్యూటిఫుల్ ఫిల్మ్ క్రియేట్ చేయగలిగినందుకు. అందరు అంటున్నారు మూడు రోజులకే సక్సెస్ సెలబ్రేషన్స్ ఏంటి అని.. ఈరోజు మేము సెలబ్రేట్ చేసుకుంటుంది నంబర్స్ను కాదు హార్ట్స్ను.. మా సినిమాకి ఎంత ప్రేమ దక్కింది చూసిన వాళ్లు ఎంత బాగా ఎంజాయ్ చేశారు అనే దాన్ని మేం వేడుక జరుపుకుంటున్నాం. బాక్సాఫీస్ బ్లాక్ బస్టర్ అవునా కాదా అనేది కాలం నిర్ణయిస్తుంది. కానీ సినిమా చూసిన వారి కళ్లలో ఆనందం చూస్తూంటే మేము ఆల్రెడీ బ్లాక్ బస్టర్ కొట్టేశాం అనిపిస్తోంది. మంచి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. అందులో 'అంటే సుందరానికి' ఒకటి" అని చెప్పుకుంటూ వచ్చారు నాని. "ఈ సందర్భంగా మీడియా మిత్రులకు సోషల్ మీడియా వారియర్స్కు ఒక విషయం చెప్తున్నాను. కొత్తగా ట్రై చేసినప్పుడు ఒక మాస్ మూవీ తో కంపేర్ చేయడం కలెక్షన్స్ ఎందుకు రాలేదు అని అడగడం కాదు. ఒక మంచి సినిమా వచ్చినప్పుడు వారి భుజాల మీద ఎత్తుకొని దాన్ని ముందుకు తీసుకెళ్తే తెలుగు సినిమా వేస్తున్న కొత్త అడుగు లో మనం అందరం భాగం అవుతాం. ఇది అందరం సెలబ్రేట్ చేసుకోవాల్సిన సినిమా. ఇది మన విజయం. రేపు ఈ సినిమా ఎక్కడికి వెళ్తోంది. బాక్సాఫీస్ను రీచ్ అవుతుందా లేదు అనేది ప్రేక్షకులకు వదిలేస్తున్నాం. ఒక పదేళ్ల తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే నా కెరీర్లో గొప్ప సినిమాల్లో అంటే సుందరానికీ ఒకటి ఉంటుంది అని నేను గర్వంగా చెప్పుకోగలను. ఇలాంటి కథలు చెప్పడానికి గట్స్ కావాలి. అవి మా డైరెక్టర్ వివేక్లో ఉన్నాయి. ఇది ఆవకాయ లాంటి సినిమా. రోజు రోజుకు ఈ సినిమా ఊరుతుంది" అన్నారు నాని. నాని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ.. "అంటే సుందరానికీ%% మాకు గొప్ప అనుభూతినిచ్చిన చిత్రం. మా బ్యానర్లో ఎప్పటికీ నిలిచిపోయే చిత్రం. ఇదో క్లాసిక్. ఈ సినిమా తీసినందుకు నిర్మాతలుగా మేము చాలా గర్వంగా ఫీలవుతున్నాం" అని అన్నారు.

## 'విరాటపర్వం' కు భారీ అడ్వాంటేజ్




రానా దగ్గుబాటి హీరోగా నటించిన లేటెస్ట్ క్రేజీ మూవీ విరాటపర్వం. వేణు ఊడుగుల తెరకెక్కించారు. సాయి పల్లవి చుట్టూ సాగే సివిల్ వార్ బేస్డ్ లవ్ డ్రామాగా ఈ మూవీని రూపొందించారు. 1992 లో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా ఈ మూవీని రూపొందించినట్టుగా దర్శకుడు వెల్లడించారు. ఓ యువతి చుట్టూ జరిగిన రాజకీయ నేపథ్యాలని కళ్లకు కట్టినట్టుగా చూపించే ప్రయత్నమే ఈ మూవీ. సురేష్ ప్రొడక్షన్స్ డి. సురేష్ బాబు సమర్పణలో ఎస్. ఎల్.వి సినిమాస్ బ్యానర్ పై చెరుకూరి సుధాకర్ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. రానా హీరో అయినా సినిమా మొత్తం సాయి పల్లవి చుట్టూ తిరగుతుంది. కథ ప్రధానంగా ఉత్తర తెలంగాణలో 1990 లో జరిగిన సంఘటనలు నక్సల్ ఉద్యమం నేపథ్యంలో సాగే సినిమా ఇది. కామ్రేడ్ రవన్న అరణ్య పేరుతో రాసే కవితలకు ప్రేరేపితురాలైన వెన్నెల అనే యువతి అతన్ని వెతుక్కుంటూ అడవి బాటపడుతుంది. ఈ క్రమంలో తను ఎదుర్కొన్న సంఘటనల సమాహారమే ఈ విరాటపర్వం. గత ఏడాది కాలగా రిలీజ్ వాయిదా పడుతూ వస్తున్న ఈ మూవీ ఎట్టకేలకు జూన్ 17న బారీ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. లేట్ గా వస్తున్నాఈ మూవీకి మంచి అడ్వాంటేజ్ అభించింది. ఇటీవల విడుదలైన సినిమాలు వారం రోజుల తరువాత ఆశించిన స్థాయిలో వసూళ్లని రాబట్టలేకపోతున్నాయి. గత కొన్ని వారాలుగా వరుసగా పెద్ద సినిమాలు విడుదలయ్యాయి. కానీ ఫస్ట్ వీక్ తరువాత మాత్రం నిరాశను పరిచాయి. మే 27న ఎఫ్ 3 విడుదలై మంచి టాక్ ని సొంతం చేసుకుంది. ఆ తరువాత విడుదలైన మేజర్ విక్రమ్ కూడా సూపర్ హిట్ టాక్ ని సొంతం చేసుకున్నాయి. ఈ రెండు సినిమాల రిలీజ్ ల తరువాత ఎఫ్ 3 కలెక్షన్స్ దారుణంగా పడిపోయాయి. ఇక ఆ తరువాత వచ్చిన అంటే సుందరానికి కారణంగా విక్రమ్ వసూళ్లపై ప్రభావం పడింది. ఈ మూవీ తరువాత వచ్చే వారం విరాటపర్వం రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే నాని సినిమా వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. విరాటపర్వం తరువాత ఆ డ్రాప్ మరింతగా పెరిగే అవకాశం వుంది. అయితే ఇక్కడే విరాటపర్వంకు మంచి అడ్వాంటేజ్ లభించింది. ఈ మూవీ తరువాత ఎలాంటి పెద్ద సినిమా రిలీజ్ కావడం లేదు. జూలై ఒకటి వరకు ఎలాంటి పెద్ద సినిమా ఈ మూవీకి పోటీగా రావడం లేదు. రెండు వారాల పాటు ఈ సినిమాకు మంచి టైమ్ లభించబోతోంది. దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకుని విరాటపర్వం భారీ వసూళ్లని రాబడుతుందో లేదో వేచి చూడాల్సిందే.

## జోకులు మీమ్ లతో నిర్మాతను ఆడుకున్నారు!



ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ పై అంతర్జాలంలో రకరకాల జోకులు ఛలోక్తులు వేడెక్కిస్తున్నాయి. అతడు ఏం చేసినా యూత్ లో ఒక సెక్షన్ ఆట పట్టిస్తూ ఉండటం కామన్ అయినా కానీ ఈసారి అందుకు భిన్నంగా అతడిని కామెడీ చేసేస్తుండడం మీడియాలో చర్చకు వచ్చింది. తాజాగా రిలీజైన ఒక పాట కరణ్ పై జోకులు పేల్చేందుకు కారణమైంది. కరణ్ జోహార్ నిర్మిస్తున్న మోస్ట్ అవైటెడ్ రొమాంటిక్ కామెడీ 'జగ్ జగ్ జియో' త్వరలో థియేటర్లలోకి రానుంది. తాజాగా ఈ చిత్రంలోని 'దుపట్టా' అనే పాటను చిత్రనిర్మాత కరణ్ జోహార్ విడుదల చేసారు. దుపట్టా అనేది పాపీ స్టైల్ డ్యాన్స్ సాంగ్.. ఇది ఒక రకంగా రీమిక్స్ లాంటిది. ఈ పాట ఆద్యంతం నిజానికి దుపట్టా (స్కార్ఫ్) చుట్టూ తిరుగుతుంది. అయితే మొత్తం పాటలో ఒక్కసారి కూడా దుపట్టా ఉపయోగించకపోవడంతో అభిమానులు చాలా వింతగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు. ఒక రకంగా కొరియోగ్రాఫర్ కి పడాల్సిన అక్షింతలు కరణ్ జోహార్ కి పడిపోతున్నాయ్. సోషల్ మీడియాల్లో నెటిజనులు కరణ్ జోహార్ ను ఒక రేంజులో ట్రోల్ చేయడం ప్రారంభించారు. చాలామంది సరదా జోకులు మీమ్ లతో కామెంట్ సెక్షన్ లో వేడెక్కిస్తున్నారు. దుపట్టా ఎక్కడ తప్పిపోయింది కరణ్ జీ? అంటూ ఒక నెటిజనుడు అడిగారు. ఒక ట్విట్టర్ యూజర్ ఫిల్మ్ మేకర్ కరణ్ ని "దుపట్టా ఎక్కడ ఉంది బ్రో?" అని అడిగాడు. బ్రూహ్ కనీస మాత్రంగా అయినా వీడియోలో సింబాలిక్ దుపట్టా కనిపించలేదు? అని వేరొక నెటిజన్ ప్రశ్నించాడు. దుపట్టా థీమ్ తో వచ్చిన పాటలో అసలు దుపట్టా కనిపించకపోవడం విచిత్రమే. కొరియోగ్రాఫర్ కి ఇదేదీ ఐడియా లేదా? అంటూ అంతా ఆశ్చర్యపోతున్నారు. ఇంతకు ముందు ఈ చిత్రంలోని మరో రెండు పాటలు 'నాచ్ పంజాబన్'.. 'రంగీ సారీ' విడుదలయ్యాయి. ఇవి రెండూ పాత బాలీవుడ్ ట్రాక్ లకు రీమిక్స్ సాంగ్స్. ఒరిజినల్ మ్యూజిక్ ట్రాక్ లకు బదులుగా కరణ్ జోహార్ తన చిత్రానికి కాపీ పాటలను మాత్రమే ఎంచుకున్నారని కొందరు నెటిజనులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జగ్ జగ్ జియో త్వరలో విడుదల కానుంది. అదే క్రమంలో కరణ్-ధావన్ జోడీ ప్రమోషన్స్ లో వేడిని పెంచింది.

## అల్లువారబ్బాయి కెరీర్ గాడిలో పడేనా..?



టాలీవుడ్ లో ఇప్పుడు స్టార్ హీరోల దగ్గర నుంచి కుర్ర హీరోల వరకూ అందరూ వరుస ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. పాండమిక్ కారణంగా కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్నవారంతా.. ఎన్నడూ లేని విధంగా కొత్త చిత్రాలకు సైన్ చేస్తున్నారు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే మరో మూవీ షూటింగును మొదలు పెడుతున్నారు. ఇండస్ట్రీలో అందరిలో నూతనోత్సాహం కనిపిస్తుంటే యంగ్ హీరో అల్లు శిరీష్ మాత్రం తన లైనప్ గురించి ఎలాంటి హింటూ ఇవ్వడం లేదు. లెజండరీ నటుడు అల్లు రామలింగయ్య మానవుడిగా అగ్ర నిర్మాత అల్లు అరవింద్ తనయుడిగా స్టార్ హీరో అల్లు అర్జున్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు శిరీష్. మెగా ఫ్యామిలీ అండతో వచ్చినప్పటికీ.. తొలి సినిమా 'గౌరవం' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. ఈ క్రమంలో వచ్చిన సినిమాల్లో 'శ్రీరస్తు శుభమస్తు' మాత్రమే సక్సెస్ అయింది. ఈ నేపథ్యంలో కాస్త గ్యాప్ తీసుకొని చేసిన 'ఏబీసీడీ' సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇలా దశాబ్దం క్రితమే కెరీర్ స్టార్ట్ చేసినా ఇంతవరకు శిరీష్ హీరోగా నిలబడలేకపోయాడు. మెగా ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలో హీరోలుగా ఎంట్రీ ఇచ్చిన వారిలో చాలామంది ఇప్పుడు సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగిస్తున్నారు. స్టార్ హీరోలను పక్కన పెడితే వరుణ్ తేజ్ – సాయి ధరమ్ తేజ్ లు టైర్-2 హీరోలలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది లాంచ్ చేయబడిన పంజా వైష్ణవ్ తేజ్ కూడా డెబ్యూ మూవీతో బ్లాక్ బస్టర్ అందుకొని.. పలు క్రేజీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకున్నాడు. కానీ శిరీష్ కెరీర్ మాత్రం ఆశించిన విధంగా ముందుకు సాగడం లేదనిపిస్తోంది. సాధారణంగా పెద్ద ఫ్యామిలీల నుంచి ఇండస్ట్రీకి వచ్చే హీరోలకు ఆఫర్స్ విషయంలో డోకా ఉండదు. పేరున్న దర్శకులతో బడా బ్యానర్లు సినిమాలు నిర్మించడానికి రెడీగా ఉంటాయి.. లేకపోతే హోమ్ ప్రొడక్షన్ లో అయినా మంచి ప్రాజెక్ట్స్ సెట్ చేస్తుంటారు. కానీ అల్లు అరవింద్ వంటి స్టార్ ప్రొడ్యూసర్ కొడుకైనప్పటికీ.. ఒక్కసారి శిరీష్ సినిమాలు గమనిస్తే మొదట్నుంచీ అతని కెరీర్ ను గాడిలో పెట్టడానికి జాగ్రత్తలు తీసుకోలేదేమో జరగలేదేమో అనిపిస్తుంది. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో అల్లు శిరీష్ హీరోగా ''ప్రేమ కాదంట'' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ కు 'జత కలిసే' ఫేమ్ రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్నారు. వినూత్నమైన కథా కథనాలతో వస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ను గతేడాదే వదిలారు. అను ఇమ్మాన్యుయేల్ తో అల్లువారబ్బాయి లిప్ లాక్ సీన్స్ కొన్నాళ్లపాటు అందరూ చర్చించుకునేలా చేసింది. అయితే ఆ తర్వాత సినిమా నుంచి మరో అప్డేట్ లేదు. కరోనా పాండమిక్ తర్వాత పరిశ్రమ నార్మల్ అవడంతో ఎప్పటిలాగానే కార్యక్రమాలు జరుగుతున్నాయి. కానీ అల్లు శిరీష్ సినిమా ఎక్కడి దాకా వచ్చింది.. ఏ స్టేజీలో ఉంది.. ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయంపై ఎలాంటి సమాచారం లేదు. దీంతో "ప్రేమ కాదంట" చిత్రంపై రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. త్వరలో ఏదొక అప్డేట్ వదిలి వాటికి చెక్ పెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతున్న అన్న బన్నీ మాదిరిగానే.. అల్లు శిరీష్ కూడా నిలదొక్కుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే పెద్ద ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ ఉన్నప్పటికీ.. శిరీష్ క్రేజీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకోకపోవడానికి కారణం తన సొంత కష్టంతో పేరు తెచ్చుకోవాలని ఫిక్స్ అవ్వడమే అని అంటున్నారు. అందుకే శిరీష్ కమర్షియల్ సినిమాల వైపు పరుగులు తీయకుండా.. కంటెంట్ ను నమ్ముకొని ముందుకు వెళుతున్నాడని చెబుతున్నారు. 'విలాయతి శరాబ్' అనే హిందీ మ్యూజిక్ ఆల్బమ్ తో నేషనల్ వైడ్ పాపులర్ అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. త్వరలోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని ఇండస్ట్రీలో నిలబడతాడని ధీమా వ్యక్తం చేస్తున్నారు.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్కు వచ్చే లాభాలను మెంబర్స్కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై ఫూలే | జై భీమ్ | జై బహుజన | జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com